Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 03.02.2017, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 35 పేజీలు : 12, వెల : ₹ 5



కేర్
డా॥ ఆలూరు స్వరూప్ కుమార్ రెడ్డి M.D.S.
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
సూపర్ స్పెషాలిటి దంత వైద్యశాల
పొగతోట, నెల్లూరు ✆ 9247004747
ఉచిత (క్యాష్‌లెస్) దంత వైద్యసేవలు
• రాష్ట్ర పోలీస్ ఉద్యోగులకు, కుటుంబ సభ్యులకు ఆరోగ్య భద్రత
• రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు EHS (ఎంప్లాయిస్ హెల్త్ స్కీము)

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

### మాటల్లో హీరో... చేతల్లో జీరో...

# కళ తప్పిన 'కమలం' బడ్జెట్!



- ఊపు లేదు, ఉత్సాహం లేదు
- ఏపికి మొండి చేయి
- ప్రసంగాలు ఘనం... ఫలితాలు శూన్యం
- పెద్దనోట్ల రద్దు ప్రయోజనాలు దాటవేత

దేశ ప్రధానిగా నరేంద్ర మోడీ వస్తే అద్భుతాలు చోటుచేసుకుంటాయని ప్రజలు ఆశించారు. అందుకే *2014* ఎన్నికల్లో నరేంద్ర మోడీకి జై కొట్టారు. బీజేపీ శ్రేణులు కూడా మోడీ ప్రచార మాయలో పడ్డాయి. బీజేపీని రెండు సీట్ల నుండి రెండొందల సీట్లకు చేర్చిన అగ్రనేత లాల్‌కిషన్ అద్వానీని ప్రధాని రేస్ నుండి పక్కనపెట్టాయి. అద్వానీ పట్ల దళ్(యు) నేత, బీహార్ సీఎం నితీష్‌కుమార్‌కున్న గురుభక్తి ఆయన పెంచి పెద్దచేసిన బీజేపీ నేతలకు లేకుండా పోయింది. కొన్ని కార్పొరేట్ కంపెనీలు వేలకోట్లు ఖర్చుపెట్టి సృష్టించిన మోడీ మాయా ప్రపంచంలో బీజేపీ పార్టీ చేరి పోయింది. కాబట్టే *2014* ఎన్నికల్లో మోడీ ప్రధాని అభ్యర్థి కాగలిగారు. ఎన్నికల తర్వాత ప్రధాని అయ్యారు. *2014* ఎన్ని కల్లో మోడీ మాయాజాలం లేకున్నా, ఆయనను ప్రధాని అభ్యర్థిగా ప్రకటించకపోయి వున్నా అధికారం ఎన్డీఏదే! కాకపోతే బీజేపీకి ఒక్క దానికే పూర్తి మెజార్టీ వచ్చి ఉండేది కాదు. మోడీ మార్క్ వల్ల బీజేపీకి కొన్ని సీట్లు పెరిగాయంతే! యూపిఏను ఇంటికి పంపించాలని దేశ ప్రజలు నిర్ణయించుకున్న తరుణంలో ముందుగా ప్రధాని అభ్యర్థిని ప్రకటించకపోయి వున్నా అధికారం ఎన్డీఏ దేననడంలో ఎలాంటి సందేహం లేదు.

మోడీని ప్రధానిని చేస్తే దేశంలో అద్భుతాలు జరుగుతాయనుకున్నారు. నిజంగానే అద్భుతాలు జరుగుతున్నాయి. పెద్దనోట్ల రద్దు వంటి అద్భుతంతో దేశ ఆర్థిక వ్యవస్థే తలక్రిందులైంది. ఎన్నో వ్యాపార రంగాలు దెబ్బతిన్నాయి. మరెన్నో పరిశ్రమలు మూతపడుతున్నాయి. ఎన్నో లక్షల మంది ఉద్యోగాలు ఊడుతున్నాయి. ఈ అద్భుతాలు చూడడానికేనా ఆయనను ప్రధానిని చేసింది.

పెద్దనోట్ల రద్దు తర్వాత దేశాన్ని స్వర్గధామంలా మారుస్తామని మోడీ చెప్పారు. మోడీ మాటను నమ్మి ప్రజలు నగదు కష్టాలను భరించారు. జనవరి 1వ తేదీన ప్రజలకు ప్రధాని కొత్త సంవత్సర కానుక ఇవ్వబోతున్నారంటూ కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు ఊరించారు. తీరాచూస్తే ఆరోజు తుస్‌మనిపించారు. కనీసం ఈ ఏడాది వార్షిక బడ్జెట్‌లోనైనా పెద్దనోట్ల రద్దుతో స్థంభించిపోయిన ఆర్థిక వ్యవస్థను తట్టి లేపుతారనుకుంటే, ఆ ఆశ కూడా లేకుండా పోయింది. 1వ తేదీ పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ పూర్తి నిరాశాజనకంగా వుంది. ఈ బడ్జెట్‌లో ఆదాయపన్ను పరిమితులు, మినహాయింపులు, తగ్గింపులను ప్రజలు ఆశించారు. అలాగే గృహనిర్మాణ వడ్డీ రేట్లు తగ్గుతాయనుకున్నారు.

(మిగతా 11వ పేజీలో)

# కుల విభజన

- బలిజలకు రిజర్వేషన్లు
- కాపులకు రిక్తహస్తం
- బాబు కొత్త పన్నాగం!





"విభజించు పాలించు" అన్న బ్రిటీషోడి సిద్ధాంతాన్ని చంద్రబాబు బాగానే వంటబట్టించుకున్నాడు. తన రాజకీయ ప్రయోగాలలో ఇప్పుడు కుల విభజనకు సిద్ధపడ్డాడు. అదే రిజర్వేషన్ల కోసం పోరాడుతున్న కాపులను విభజించడం! *2014* ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన రిజర్వేషన్ హామీ వల్ల కాపులు, బలిజ, తెలగ, ఒంటరి కులాలందరూ ఒక్కటై తెలుగుదేశంకు ఓట్లేసారు. 'కాపు' క్రింద ఏకమైన ఈ కులాలను చంద్రబాబు ఇప్పుడు విడదీయబోతున్నాడు. ఇందుకు మంజునాథ్ కమిషన్‌ను వేదికగా చేసుకోబోతున్నాడు.

(మిగతా 10వ పేజీలో)



# హోదా ఊబిలో చంద్రసైన్యం

- → ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత
- → ప్యాకేజీతో 'దేశం'కు డామేజీ

*ఇంతకంటే దగా ఉందా? ఇంతకంటే మోసం ఉందా? ఇంతకంటే వంచన ఉందా? ఇంతకు మించిన దారుణం ఉందా? భారతదేశ అత్యున్నత శాసనవ్యవస్థ పార్లమెంటు సాక్షిగా చెప్పిన మాటకు, చేసిన బాసకు విలువలేకుంటే ఇక ఇక్కడ ప్రజాస్వామ్యం నడుస్తున్నట్లా? ప్రజాప్రభుత్వం నడుస్తున్నట్లా?*

ఆంధ్రప్రదేశ్... మూడేళ్లుగా రెండు ప్రభుత్వాల చేతుల్లో మోసపోయిన రాష్ట్రం. రాష్ట్ర విభజన ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు చిప్ప చేతికిచ్చి పంపించిన ఘనత యూపిఏ ప్రభుత్వానిది. అయితే విభజన సమయంలో ఏపికి ప్రత్యేకహోదా కల్పిస్తామన్న హామీని అటకెక్కించిన కీర్తి నేటి ఎన్డీఏ ప్రభుత్వానిది. 2014 ఎన్నికల ప్రచారసభల్లో ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగం సి.డిలను మళ్ళీ ఒక్కసారి చూస్తే, నాయకులు ఇంత కర్కోటకంగా ఎలా మారగలుగుతారనిపిస్తోంది. ఆరోజు మోడీ ఆంధ్రప్రదేశ్‌పై ఎంతో ప్రేమ కురిపించాడు. ఎంతో దయ చూపించాడు. అలాంటి మోడీ ప్రధాని అయ్యాక ఏపికి ఇలా దగాటోపీ ఎలా పెట్టగలిగాడన్న

(మిగతా 11వ పేజీలో)

కాంచీపురం నుండి నేరుగా నెల్లూరుకి



కంచి పట్టు చీరలు
వీవర్స్ ధరలకే
సాంప్రదాయకరమైనటువంటి కంచి కోరాపట్టు, కంచి టస్సర్ పట్టు,
కంచి లెనిన్ పట్టు, కంచి గాంధర్వ పట్టు, సాత్విక పట్టు,
ఉప్పాడ పట్టు, ఇక్కత్‌పట్టు లాంటి వినూత్న కలెక్షన్లతో
నేరుగా వీవర్స్ ధరలకే అమ్మకం..
ప్రారంభ ధర రూ॥695/-నుండి లభ్యం..
KANCHEEPURAM VRK SILKS
#27B/76, నాడు స్ట్రీట్, షేక్‌పేట్,
కాంచిపురం. Ph: 044 27222226
VRK SILKS: 1st ఫ్లోర్, WOMAN'S WORLD
కె.వి.ఆర్ పెట్రోల్ బంక్ ఎదురుగా, దర్గామిట్టా, నెల్లూరు. ఫోన్: 2316667
పెళ్ళిళ్లకు, ఇండ్ల దగ్గర అమ్మే వస్త్ర వ్యాపారులకు అద్భుత అవకాశం





## కార్పొరేషన్‌లో... పింఛన్ చిచ్చు!

నెల్లూరు నగరపాలక సంస్థ కేంద్రంగా తెలుగుదేశం పార్టీలోనే నాలుగుస్థంభాలాట నడుస్తోంది. మేయర్ అజీజ్ ఒక స్థంభం కాగా, ఆనం, ఆదాల, ముంగమూరులు మరో మూడుస్థంభాలుగా మారి ఆడుకుంటున్నారు. మిగిలిన ముగ్గురికి కూడా మేయర్ అజీజ్ చిక్కడం లేదు. ఇప్పటికే ఎస్సీ సబ్‌ప్లాన్ పనుల విషయంలో మంత్రితో పాటు తెలుగుదేశం పార్టీ నెల్లూరు నగరం, రూరల్ ఇన్‌ఛార్జ్‌లుగా ఉన్న ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డిలతోనూ అజీజ్ విభేదించాడు. ఈ విషయంలో ఆయన మంత్రిని కూడా లెక్కచేయలేదు. ఇప్పుడు పింఛన్‌ల వ్యవహారం మరింతగా నిప్పు రాజేసింది. కార్పొరేషన్ పరిధిలో ఆనం, ఆదాల, ముంగమూరులు అందజేసిన పింఛన్‌ల దరఖాస్తులను అజీజ్ పక్కనపెట్టేసాడు. అలాగే తనకు పడని కార్పొరేటర్‌ల దరఖాస్తులను కూడా ఆయన పట్టించుకోలేదు. ప్రతి డివిజన్‌లోనూ తనకు నచ్చినవారికే పింఛన్‌లు ఇచ్చాడు. తన అనుచర కార్పొరేటర్లు ఇచ్చిన హింఛన్ దరఖాస్తులకే ఓకే చెప్పాడు. ఈ పరిణామంతో ఆనం, ఆదాల, ముంగమూరులు ఉడికిపోతున్నారు. మేయర్ మీద మంత్రికి కూడా ఫిర్యాదు చేసారు. కాని, అజీజ్ మాత్రం వీరిని ఖాతరు చేయకుండా చంద్రబాబుతో, లోకేష్‌తో టచ్‌లో ఉంటున్నాడు. ఇంత బ్రతుకు బతికి ఇంటెనక చచ్చినట్లు... రాజకీయాల్లో మహామహులనే ఢీకొట్టిన ఆనం, ఆదాలలకు ఏ మాత్రం రాజకీయ అనుభవం లేని అజీజ్ రూపంలో తలనొప్పి తయారైంది.

# నడక... ఆరోగ్యానికి కానుక

**• మూడుజిల్లాల గవర్నర్‌గా బి.మనోహర్‌రెడ్డి**




వాకర్స్ గవర్నర్ బి.మనోహర్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మేయర్ అజీజ్ తదితరులు



సిల్వర్‌జూబ్లీ వాకర్ పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డికి సన్మానం

వాకర్స్ ఇంటర్నేషనల్ నెల్లూరు, గుంటూరు, ప్రకాశం జిల్లాల గవర్నర్‌గా బి.మనోహర్‌రెడ్డి ప్రమాణస్వీకారోత్సవం జనవరి 29వ తేదీ నెల్లూరు, దర్గామిట్ట లోని వాయుగండ్ల బ్రహ్మయ్య కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు సీతారామయ్యలు పాల్గొని నడకవల్ల ప్రయోజనాలను వివరించారు. ప్రజల్లో వాకింగ్ పట్ల అవగాహన కల్పించేందుకు ఎంతగానో కృషి చేస్తున్న బి.మనోహర్‌రెడ్డి మూడుజిల్లాల వాకర్స్ గవర్నర్ కావడాన్ని అభినందించారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి నడకను ఒక అలవాటుగా, ఒక వ్యసనంగా మార్చుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరినీ ఆరోగ్యంగా ఉంచడానికి మించిన సామాజిక సేవ ఇంకేమీ లేదని, వాకింగ్ పట్ల ప్రతిఒక్కరికీ ఆసక్తి కలిగేలా కృషి చేస్తానని గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిల్వర్‌జూబ్లీ వాకర్‌గా విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పందిళ్లపల్లి పట్టాభిరామిరెడ్డిని ముఖ్య అతిథులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు ఎం.వి.సుబ్బారెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, నాగభూషణం, రఘునందన్, దేవరాల సుబ్రహ్మణ్యం, డాక్టర్ అంకిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర సాహిత్య అకాడమీ రైటర్స్ ఫోరమ్‌కు ఆహ్వానం

**- చిన్ని నారాయణరావు**

కేంద్ర సాహిత్య అకాడమీ–న్యూఢిల్లీ, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక రైటర్స్ ఫోరమ్ నిర్వహిస్తున్నామని, సాహిత్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడం, యువతను సాహిత్యం వైపు మళ్ళించడం ఈ రైటర్స్ ఫోరమ్ నిర్వహణకు ప్రాతిపదిక కాబోతోందని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు చిన్ని నారాయణరావు, కార్యదర్శి ఈతకోట సుబ్బారావు పేర్కొన్నారు. నెల్లూరు కవుల కవితా వైభవాన్ని స్మరించుకుని, భావి తరాలకు స్ఫూర్తిదాయకంగా ఈ రైటర్స్ ఫోరం వేదిక కాబోతుందని వారు పేర్కొన్నారు. ఇందులో భాగంగా, ఫిబ్రవరి 18వ తేది ఉదయం 10గంటలకు నెల్లూరు లోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం ఆడిటోరియంలోని (విఆర్ హైస్కూల్ ఆవరణలో) సమావేశమందిరంలో ప్రముఖ సాహితీవేత్తలు, కవుల ఉపన్యాసాలతో వేదిక కళకళలాడుతుందని వారు తెలిపారు. కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ కవి పాపినేని శివశంకర్ ఉపన్యాసంతో సభ ప్రారంభమవుతుందన్నారు. విక్రమసింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వి. వీరయ్య అధ్యక్షత వహిస్తారని, ముఖ్య అతిథిగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.ఎం.డి ఇంతియాజ్ పాల్గొంటారని, ఆత్మీయ అతిథిగా కావలి మార్కెటింగ్ కమిటీ ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యయాదవ్ పాల్గొంటారని తెలిపారు. నెల్లూరు సాహితీకీర్తిని దశదిశలా చాటి దివంగతులైన కవులు కీ.శే గుంటూరు శేషేంద్రశర్మ, పఠాభి, ఆత్రేయ, మల్లెమాల, దువ్వూరు రామిరెడ్డి కవితావైభవంపై ప్రముఖ సాహితీవేత్తలు బీరం సుందరరావు, మేడిపల్లి రవికుమార్, శ్రీమతి వి.ప్రతిమ, కరిమద్దెల నరసింహా రెడ్డి, చందు సుబ్బారావు ప్రసంగిస్తారని వారు వివరించారు. ఎంతో విశిష్టమైన ఈ కార్యక్రమానికి కవులు, రచయితలు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని చిన్ని నారాయణరావు, ఈతకోట సుబ్బారావులు కోరారు.




## సంక్రాంతి సక్ససర్లకు...

# సుబ్బరామయ్య సత్కారాలు

సంక్రాంతి పర్వదినం సందర్భంగా విడుదలైన రెండు చిత్రాలు ఘనవిజయం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని రాజ్యసభసభ్యుడు, కళాబంధు టి.సుబ్బరామిరెడ్డి ఆయా చిత్రాలకు చెందిన ప్రముఖులను ఇటీవల హైదరాబాద్‌లోని పార్క్ హయత్‌లో ఘనంగా సత్కరించారు. యువరత్న నందమూరి బాలకృష్ణ నటించిన నూరవచిత్రం 'గౌతమీపుత్ర శాతకర్ణి' దిగ్విజయం కావడం, అదేవిధంగా మెగాస్టార్ చిరంజీవి నటించిన 150వ చిత్రం 'ఖైదీ నంబర్ 150' చిత్రం ఘనవిజయం సాధించడం, ఈ రెండు చిత్రాలు సంక్రాంతి రోజు విడుదలై విజయం సాధించాయి కనుక, సంక్రాంతి సక్ససర్లకు టిఎస్సార్ నేతృత్వంలో ఘనంగా సత్కారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టిఎస్‌ఆర్ మాట్లాడుతూ హీరో బాలకృష్ణకు, గౌతమీపుత్ర శాతకర్ణి దర్శకుడు క్రిష్‌కు ఆయన తన కళాభినందనలు తెలిపారు. 'దానవీరశూర కర్ణ'గా ఎన్టీఆర్ ఎంతగా ప్రజలను ఆకట్టుకున్నారో, అదేవిధంగా ఈ చిత్రంతో




బాలకృష్ణ 'గౌతమీపుత్ర శాతకర్ణి'గా అందరి మనస్సుల్లో నిలచిపోతారని ఆయన ప్రశంసించారు. ఈ చిత్ర దర్శకుడు క్రిష్ ప్రతిభ అమోఘమని, శాతకర్ణి వంటి ఓ తెలుగు వీరుడిని తెలుగుప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలచిపోయేలా ఈ చిత్రాన్ని రూపొందించారని అభినందించారు. బాలకృష్ణ మాట్లాడుతూ, నాన్నగారు శాతకర్ణి చరిత్రను సినిమాగా తీయాలని అనుకున్నారు కానీ, కారణాంతరాల వల్ల తీయలేక పోయారని, ఇప్పుడు ఆ సినిమాలో నటించే అవకాశం లభించడం తనకు గర్వకారణమన్నారు. నాన్నగారి ఆశీస్సుల వల్లే ఇలాంటి అద్భుతమైన చిత్రంలో నటించే అవకాశం తనకు దక్కిందన్నారు. ప్రత్యేకించి కళలను ఎంతగానో ఆదరిస్తూ సినీకళాకారులను అభినందించి ప్రోత్సహిస్తున్న కళాహృదయుడు టిఎస్సార్‌కు బాలకృష్ణ తన ధన్యవాదాలు తెలియజేశారు. ఆద్యంతం అత్యద్భుతంగా జరిగిన ఈ సత్కారాల కార్యక్రమంలో ఈ చిత్రానికి సంబంధించిన ప్రముఖులను, సాంకేతిక నిపుణులను టిఎస్సార్ ఘనంగా సన్మానించారు. హీరోయిన్ తమన్నాతో పాటు, చిత్ర దర్శకుడు క్రిష్, నిర్మాతలు జాగర్లమూడి సాయిబాబు, బిబో శ్రీనివాస్, రచయిత బుర్రా సాయిమాధవ్, సంగీత దర్శకుడు చిరంతన్‌భట్, ఛాయాగ్రాకుడు జ్ఞానశేఖర్‌లతో పాటు ఇతర సాంకేతిక నిపుణులందరు టిఎస్సార్ ఆత్మీయ సత్కారాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అనేకమంది సినీ ప్రముఖులు పాల్గొన్నారు.





## మెగాస్టార్‌కు ఘన సత్కారం

'ఖైదీ నంబర్–150' చిత్రం దిగ్విజయం కావడంతో మెగాస్టార్ చిరంజీవిని టిఎస్‌ఆర్ ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ చిత్రంలో చిరు అద్వితీయమైన నటనను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో చిరంజీవితో పాటు, అక్కినేని నాగార్జున, హీరో రాంచరణ్ తదితరులు పాల్గొన్నారు.

# దేశంలోనే ఏపి ముందంజ

**- రాష్ట్ర మంత్రి నారాయణ**



అభివృద్ధి పనుల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ముందంజలో ఉందని రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నెల్లూరులో జరుగుతున్న భూగర్భ మురుగు వ్యవస్థ, తాగునీటి పైప్‌లైన్ల పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. తొలుత అల్లీపురంలో నూతనంగా నిర్మిస్తున్న మురుగునీటి శుద్ధి కేంద్రం(సీపేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) పనులను నెల్లూరులోని రిత్విక్ ఎన్‌క్లేవ్ ప్రాంతంలో జరుగుతున్న భూగర్భ మురుగు వ్యవస్థ పనులను పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని 110 మునిసిపాలిటీల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నామన్నారు. నెల్లూరు నగరంలో 700కి.మీ మేర రూ.556 కోట్లతో భూగర్భ సురక్షిత నీరు పైపులైన్లు నిర్మిస్తున్నామని, 32 ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులను ఇప్పటి వరకు 29 నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. రూ.580కోట్లతో చేపట్టిన భూగర్భ మురుగు వ్యవస్థ పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నగర మేయర్ అబ్దుల్ అజీజ్, టిడిపి నగర ఇన్‌ఛార్జి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, చాట్ల నరశింహారావు, నగర అధ్యక్షులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఇన్‌ఛార్జి కమిషనర్ రామిరెడ్డి, ఎస్.ఇ మోహన్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# ఫ్రెండ్లీ పోలీసు కోసం... ఎస్పీ క్రికెట్ పోటీలు



ప్రజలకు పోలీసులను సన్నిహితం చేసే కార్యక్రమంలో భాగంగా ఎస్పీ క్రికెట్ ట్రోఫీకి శ్రీకారం చుట్టాడు జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ. పోలీసులను ప్రజలకు చేరువ చేయాలి. ప్రజలతో సత్సంబంధాలు ఏర్పడాలి. పోలీసుల పనితీరును ప్రజలు గుర్తించాలి. ముఖ్యంగా యువతను పోలీసు శాఖలో భాగస్వామ్యులను చేయాలి. అందుకే ఈ ఫ్రెండ్లీ క్రికెట్ పోటీలను ఈ నెల 11వ తేదీ నుండి నిర్వహిస్తున్నట్లు 1వ తేదీ నెల్లూరు పోలీస్ గ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్ర పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ చెప్పారు. 30ఏళ్లలోపు యువకులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. ఎలాంటి ప్రవేశ రుసుం లేకుండానే ఈ నెల 3వ తేదీ నుండి 10వ తేదీలోగా ఆయా మండల పోలీస్‌స్టేషన్‌లలో వివరాలు అందజేయాలి. 11వ తేదీ నుండి క్రికెట్ పోటీలు మొదలవుతాయి. తొలుత మండల స్థాయి, సర్కిల్ స్థాయి, సబ్‌డివిజన్ స్థాయిలలో పోటీలు జరుగుతాయి. వీటిలో నెగ్గుకొచ్చిన జట్లకు జిల్లా స్థాయి పోటీలుంటాయి. క్రింది స్థాయి పోటీలన్నీ పూర్తయ్యాక జిల్లా స్థాయి పోటీల తేదీని నిర్ణయించడం జరుగుతుందని, జిల్లా స్థాయిలో విజేతలకు మొదటి బహుమతిగా 25వేలు, రెండవ బహుమతిగా 15వేలు, మూడవ బహుమతిగా 10వేలు అందజేస్తామని ఎస్పీ తెలిపారు. జిల్లాలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఏఎస్పీ శరత్‌బాబు, క్రైం ఏఎస్‌డి విఠలేశ్వర్, డిఎస్పీలు జి.వి.రాముడు, తిరుమలేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, వరసుందరంలు పాల్గొన్నారు.






## కేంద్రమే కదిలొచ్చింది...

# పాస్‌పోర్ట్ ఇంటికొచ్చింది

### ఓ తండ్రి హృదయ వేదనకు స్పందించిన కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి సుష్మాస్వరాజ్



**మనం తహశీల్దార్‌కో, ఎస్.ఐ కో అర్జీ ఇచ్చామంటే దాని పరిష్కారం కోసం వారాలు కాదు, నెలల పాటూ తిరగాలి. తిరిగి తిరిగి కాళ్ళ చెప్పులరిగిపోవాలి. ఇది చిన్నచిన్న ప్రభుత్వ కార్యాలయాలలో ఉండే పరిస్థితి.**

కాని, అందరూ అలాగే ఉండరని, అన్ని ప్రభుత్వ శాఖలు అలాగే ఉండవని చాటిచెప్పే సంఘటన ఇది. ఓ తండ్రి హృదయ వేదనకు కేంద్రమే చలించింది. కేంద్రప్రభుత్వమే ఆయన ఇంటికి నడిచొచ్చింది. నెల్లూరు నుండి వెళ్లిన ఒకే ఒక్క మెసేజ్‌తో ఢిల్లీలోని ప్రభుత్వమే స్పందించింది. ఆ తండ్రి సమస్యను పరిష్కరించింది.

వివరాల్లోకి వెళితే... నెల్లూరులో చిన్నమొత్తాల పొదుపు సంస్థ డిప్యూటి తహశీల్దార్‌గా పనిచేసి రిటైర్డ్ అయిన రాళ్లపల్లి రామసుబ్బారావు, మాజీ కౌన్సిలర్, సుప్రసిద్ధ గాయని శ్రీమతి రాళ్లపల్లి సుబ్బలక్ష్మిలను తెలియని వాళ్లుండరు. వారికి ఇద్దరు కుమార్తెలు. ఇద్దరూ వికలాంగులే! పెద్ద కుమార్తె గాయత్రికి 72 శాతం, చిన్న కుమార్తె శర్వాణికి 90శాతం పోలియో! వీరిద్దరికీ పాస్‌పోర్ట్‌ల కోసం దరఖాస్తు చేయాల్సి వచ్చింది. గతంలో పోస్ట్‌లో అప్లికేషన్ పంపిస్తే, ఇంటి వద్ద పోలీస్ వెరిఫికేషన్ జరిగి, పోస్ట్‌లోనే పాస్‌పోర్ట్ వచ్చేది. అయితే కొంతకాలంగా ఆ పద్ధతి మారింది. ఆన్‌లైన్‌లో పాస్‌పోర్ట్‌కు దరఖాస్తు చేసి స్లాట్ బుక్ చేసుకోవాలి. వారిచ్చిన సమయం ప్రకారం తిరుపతిలోని ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయంలో హాజరు కావాలి. వికలాంగులైన తన ఇద్దరు బిడ్డలను పాస్‌పోర్ట్ కార్యాలయాలకు తీసుకెళ్లడం ఆయనకు సమస్యగా మారింది. చట్టం దృష్టిలో అందరూ సమానమే! నిబంధనల ప్రకారమే అందరూ పాస్‌పోర్టులు పొందాలి. కాని, ఎంతటి చట్టమైనా మానవతా విలువలను మించిపోదు కదా! రాళ్లపల్లి రామసుబ్బారావు 'ఛేంజ్ డాట్ ఆర్గ్' అనే వెబ్‌సైట్‌లో కేంద్ర ప్రభుత్వానికి ఇదే ప్రశ్నను సంధించాడు. వికలాంగులు, వృద్ధులు దూరాభార ప్రాంతాలలో వున్న పాస్‌పోర్ట్ కార్యాలయాలకు ఎలా వెళ్లగలరని, ఇలాంటి వారిని మానవతా కోణంలో ఆలోచించి ప్రభుత్వమే వారి దగ్గరకొచ్చి సమస్యను పరిష్కరించాలని ఆయన చేసిన సూచనకు నెట్‌లో దాదాపు 58వేల మంది వీక్షకుల నుండి మద్దతు లభించింది. ఈ అంశంపై కేంద్ర విదేశాంగ మంత్రి శ్రీమతి సుష్మాస్వరాజ్ వెంటనే స్పందించారు. మీ సమస్యను వెంటనే పరిష్కరిస్తానని ఆమె వెబ్‌సైట్‌లో వెంటనే పోస్ట్ చేసింది. అలాగే రాళ్లపల్లి రామసుబ్బారావుకు కేంద్ర విదేశాంగ మంత్రి కార్యాలయం నుండి ఫోన్ వచ్చింది. జనవరి 24వ తేదీ సాయంత్రం కల్లా మీ ఇద్దరి బిడ్డల పాస్‌పోర్టులు పాస్‌పోర్ట్ అధికారులే తెచ్చిస్తారని వారు ఫోన్‌లో తెలిపారు. ఆ తర్వాత ఢిల్లీలోని చీఫ్ పాస్‌పోర్ట్ ఆఫీసర్, హైదరాబాద్‌లోని రీజనల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్, తిరుపతిలోని అసిస్టెంట్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ మరియు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు లైన్‌లోకి వచ్చారు. జనవరి 24వ తేదీ ఉదయం 10గంటలకు పాస్‌పోర్ట్ దర్యాప్తు ప్రక్రియను మొదలుపెట్టి మధ్యాహ్నం 3గంటలకల్లా పూర్తి చేశారు. పాస్‌పోర్ట్ అధికారులు నివేదిత, అమృతరావులు జనవరి 24వ తేదీ నెల్లూరు, టెక్కేమిట్టలోని రామసుబ్బారావు నివాసానికి విచ్చేసి గాయత్రిదేవి, శర్వాణిల పాస్‌పోర్టులను స్వయంగా అందజేశారు.

ఈ సంఘటనపై రామసుబ్బారావు స్పందిస్తూ, తన ఇద్దరి బిడ్డల పాస్‌పోర్ట్‌ల విషయంలోనే కాదని, ఈ దేశంలో వున్న ప్రతి వికలాంగులు, వృద్ధుల విషయంలో కేంద్రం ఇలాగే స్పందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేసారు. తన పోస్ట్‌కు మానవత్వంతో స్పందించిన కేంద్రమంత్రి సుష్మాస్వరాజ్‌కు, పాస్‌పోర్ట్ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



ఈ నెల 1వ తేదీ పెనుబర్తి జడ్పీ హైస్కూల్‌లో జరిగిన సరస్వతి పూజలో పాల్గొని విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ చేస్తున్న నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి




## 'ప్రభా'తం

# భరోసాలేని బడ్జెట్



కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ 2017-18 సంవత్సరానికి కేటాయించిన బడ్జెట్ ఆశ, నిరాశల మిశ్రమంగా వుంది. కొన్ని రంగాలకు చేయూతనిచ్చి, మరికొన్ని రంగాలకు మొండి చేయిచ్చారు. ప్రాధాన్యతా రంగాలకు పెద్దపీట వేయడం, పన్నుల వ్యవస్థలో కొత్త విధానాలకు, రాజకీయరంగంలో సంస్కరణలకు బాటలు వేయడం విశేషం. సాధారణ బడ్జెట్‌లో రైల్వే బడ్జెట్‌ను విలీనం చేయడం చరిత్రాత్మకం. అయితే పెద్దనోట్ల రద్దు తర్వాత కుదేలైపోయిన వ్యాపార రంగాలకు భరోసా ఇవ్వడంలో ఈ బడ్జెట్ విఫలమైందనే చెప్పొచ్చు.

అందరూ ఎదురుచూస్తున్న బడ్జెట్ రానే వచ్చింది. బడ్జెట్ రాకమునుపు వున్న అనేక అనుమానాలను నివృత్తిచేస్తూ, దేశాభ్యున్నతికి అవసరమైన పలు కీలక అంశాలపై దృష్టి కేంద్రీకరిస్తూ కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ 2017-18 సంవత్సరానికి బడ్జెట్ సమర్పించారు. ముఖ్యంగా దేశంలో పెద్దనోట్ల రద్దు తర్వాత వచ్చిన బడ్జెట్ ఇది. దేశ వ్యాప్తంగా ఈ బడ్జెట్‌పై ప్రజల అంచనాలు భారీగా వున్నాయి. ప్రధానంగా పెద్దనోట్ల రద్దువల్ల దెబ్బతిన్న వ్యాపార రంగాల వారు ఈ బడ్జెట్ మూలంగానన్నా తిరిగి తమ వ్యాపారాలు పట్టాలు ఎక్కుతాయని ఎదురు చూశారు. కాని, వారి ఎదురుచూపులు నిష్ఫలమే అయ్యాయి. జైట్లీ బడ్జెట్ వారికి ఏ విధంగానూ భరోసా ఇవ్వలేకపోయింది. ముఖ్యంగా దేశంలో వ్యవసాయ రంగం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తూ, ఎక్కువ వ్యాపార రంగాలతో అనుసంధానమై ఉన్న రియల్ ఎస్టేట్ రంగానికి పునరుజ్జీవన కల్పించడానికి ఈ బడ్జెట్ ఏ విధంగానూ దోహదం చేయలేకపోయింది. అయితే, సామాజిక, దేశ ఆర్థిక పటిష్టత, మౌలిక సదుపాయాల కల్పన వంటి విషయాల్లో మాత్రం ఈ బడ్జెట్ కొంత మెరుగ్గానే ఉంది. మునుపెన్నడూ లేనివిధంగా రాజకీయ సంస్కరణలకు బాటలు వేస్తూ, రాజకీయపార్టీలకు విరాళాల విషయంలో నిబంధనలను కఠినతరం చేయడం, విరాళాలను నగదు రూపంలో తీసుకోవాలంటే ఆ పరిధిని 2వేలకే కుదించడం సాహసోపేత నిర్ణయం. రాజకీయపార్టీలు పారదర్శకంగా వుండాలని ఆకాంక్షిస్తూ పార్టీలు ఐటి రిటర్న్ దాఖలు చేయాలని స్పష్టీకరించడం రాజకీయరంగంలోనే ఒక సరికొత్త సంచలనం. అదేవిధంగా బ్యాంకుల్లో భారీగా రుణాలు తీసుకుని చెల్లించకుండా విదేశాలకు తరలిపోయినవారిని దృష్టిలో పెట్టుకుని, బ్యాంక్ డిఫాల్టర్ల ఆస్తులు జప్తు చేయడానికి పటిష్టమైన చట్టం తీసుకువస్తామనడం హర్షదాయకం. ఇలా ఎన్నో కీలకమైన నిర్ణయాలకు జైట్లీ బడ్జెట్ వేదికైంది. పెద్దనోట్ల రద్దు తర్వాత పన్నుల వ్యవస్థలో ఎలాంటి మార్పులు వుంటాయోనని ఆసక్తితో ఎదురుచూస్తున్న సాధారణ ప్రజానీకానికి ఈ బడ్జెట్ కొంతమేరకు ఊరడింపునిచ్చిందనవచ్చు. పన్నువిధానంలో సంస్కరణలు తెస్తూ, 2.5లక్షల లోపు ఆదాయం వున్నవారికి పన్ను మినహాయింపు ఇవ్వడం మధ్యతరగతివారికి సంతోషం కలిగించే విషయం. మొత్తం బడ్జెట్ 21.47 లక్షల కోట్లు కాగా, ఇందులో ప్రాధాన్యతా రంగాలైన వ్యవసాయం, సాగునీరు, పరిశ్రమలు, విద్య, వైద్యం, ఉపాధితో పాటు, మహిళారంగానికీ, స్త్రీ శిశు సంక్షేమానికి, ఎస్సీ, ఎస్టీ, బిసిలు, మైనార్టీల సంక్షేమానికి గతంలోకంటే మిన్నగా నిధులు కేటాయించడం మంచిపరిణామం. అయితే, రైతులకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, ఆంధ్రరాష్ట్రంలో వర్షాభావంతో కరువు ఏర్పడినా బడ్జెట్‌లో ప్రస్తావన లేకపోవడం ఇక్కడి రైతులకు ఆవేదన కలిగిస్తోంది. అదేవిధంగా యువతకు తగ్గ ఉపాధి, ఉద్యోగావకాశాలు లేకపోవడం యువతలో నిరాశకు కారణమవుతోంది. బడ్జెట్‌లో ఇలాంటి సమస్యలపై కూడా స్పందించివుంటే బావుండేది. ఇకపోతే, దేశభద్రతకు మరింత పటిష్టమైన చర్యలు తీసుకునేందుకు వీలుగా రక్షణరంగానికి 2.7 లక్షల కోట్లు కేటాయించడం హర్షదాయకం. అంతేకాదు, ఈసారి తొలిసారిగా సాధారణ బడ్జెట్‌లో రైల్వేబడ్జెట్‌ను కూడా విలీనం చేస్తూ అందుకు అనుగుణంగా ఈ బడ్జెట్‌ను రూపొందించడం ఎంతైనా చరిత్రాత్మక పరిణామమే. రైల్వే అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయిస్తూ 1.31 లక్షల కోట్లను రైల్వేబడ్జెట్‌గా కేటాయించడం, రైల్వే ప్రయాణీకుల భద్రతకు పెద్దపీట వేస్తూ..వచ్చే అయిదేళ్ళకు లక్ష కోట్లు కేటాయించడం, ఈ-రైల్వే టికెట్‌లకు సర్వీస్‌ఛార్జి మినహాయించడం, రైల్వేకి కేంద్రం సాయంగా 55 వేల కోట్లు కేటాయించడం, రైల్వేల ఆధునీకరణకు, కొత్త మెట్రో రైల్వే విధానానికి నిధులు కేటాయించడం, రైల్వే క్రాసింగ్స్‌లో ప్రమాదాలను దృష్టిలో వుంచుకుని 2020 నాటికి కాపలా లేని రైల్వే క్రాసింగ్‌లు వుండనే వుండవని స్పష్టం చేయడం వంటివన్నీ రైలు ప్రయాణీకులకు ఎంతో భరోసానిచ్చేవేననడంలో సందేహం లేదు. అయితే, రైల్వే భద్రతకు అవసరమైన సిబ్బంది కొరత తీవ్రంగా వున్న విషయం అందరికీ తెలిసిందే. సుమారు లక్షకు పైగానే సిబ్బంది ఖాళీలున్నా ఆ నియామకాలకు చొరవ చూపకపోవడం విచారకరం. ఆ మేరకు సిబ్బంది భర్తీకి ఈ బడ్జెట్ ప్రస్తావనలో ఎలాంటి హామీ లేకపోవడంతో భద్రత విషయం గాలికొదిలేసినట్లేనా అన్న విమర్శలూ సర్వత్రా విన వచ్చాయి. ఇదిలావుంటే, దేశానికి అన్నం పెట్టే రైతన్నల సంక్షేమానికి పుష్కలంగా నిధులు కేటాయించి తమది 'రైతు బడ్జెట్' అని జైట్లీ నిరూపించుకున్నారు. రైతులకు సులభంగా రుణాలు అందేలా చేయడం, వ్యవసాయ రుణాలకు 10 లక్షల కోట్లు కేటాయించడం, సాగునీటి రంగానికి 40 వేల కోట్లు, పాడిపరిశ్రమకు 8వేల కోట్లు కేటాయించడం వంటివి ఈ బడ్జెట్‌లో చోటుచేసుకోవడంతో అన్నదాతలు ఆనందిస్తున్నారు. అంతేకాదు, జైట్లీ తన బడ్జెట్‌లో కీలక రంగాలకు తగు ప్రాధాన్యత ఇవ్వడం శుభపరిణామం. మౌలికవసతుల రంగానికి 3.9 లక్షల కోట్లు, గ్రామీణరోడ్లకు 19వేల కోట్లు, జాతీయ రహదారులకు 64వేల కోట్లు, శాస్త్ర సాంకేతిక రంగానికి 34,435కోట్లు ఇలా ప్రాధాన్యతారంగాలకు బాగానే నిధులను కేటాయించారు. వైద్యపరికరాల ధరలను తగ్గిస్తూ, పి.జి, మెడికల్ కోర్సుల్లో సీట్ల సంఖ్యను పెంచేందుకు నిర్ణయించడం ఆయా రంగాల అభివృద్ధికి ఆసరానిచ్చేవే. అదేవిధంగా, గర్భిణులకు 6వేల నగదు బదిలీ చేయడం, వృద్ధులకు ఆధార్ ఆధారిత హెల్త్‌కార్డులు మంజూరుచేయడం, 8శాతం గ్యారెంటీతో ఎల్ఐసి పథకం వర్తింపజేయడం, 2025 నాటికి ప్రాణాంతకమైన క్షయవ్యాధిని నివారిస్తామని హామీ ఇవ్వడం, దేశంలో 28వేల ఫ్లోరైడ్ గ్రామాలకు ఉచితంగా మంచినీరు సరఫరా చేసేందుకు నిర్ణయించడం, మహిళాశక్తి కేంద్రాలకు 5వందల కోట్లు, ఉపాధి హామీకి 48వేల కోట్లు కేటాయించడం వంటివన్నీ కొంతవరకు మెరుపులే! దేశ ప్రజల ఆశలను, ఆకాంక్షలను అందుకోవడంలో జైట్లీ బడ్జెట్ విఫలమైందనే చెప్పవచ్చు.

# వెంకయ్యను అంటే కళ్ళు పోతాయ్...

## - పవన్‌పై బిజెపి నాయకుల ఆగ్రహం




రాష్ట్రాభివృద్ధికి ఎంతగానో కృషిచేస్తున్న కేంద్రమంత్రి వెంకయ్యనాయుడిపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ లేనిపోని ఆరోపణలు చేయడం ఏమిటని, వాస్తవాలు తెలుసుకోకుండా కేవలం రాజకీయ లబ్ది కోసమే అలాంటి ఆరోపణలు చేస్తున్నారని, అది మంచిపద్ధతి కాదని పవన్‌పై బిజెపి నాయకులు మండిపడ్డారు. గతనెల 28న జిల్లా బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిజెపి రాష్ట్ర అధికారప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి కేంద్రమంత్రి వెంకయ్యనాయుడుపై పవన్‌కల్యాణ్ చేసిన ఆరోపణలను ఖండించారు. గత ఎన్నికల్లో పవన్ మద్దతుతోనే కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చాయనడంలో వాస్తవం లేదన్నారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి మాట్లాడుతూ, పవన్ కల్యాణ్ సైడ్‌హీరోగా కాకుండా హీరోగా ప్రజల్లోకి వచ్చి వాస్తవాలు మాట్లాడాలని, నిజాలు తెలుసుకుని ప్రజాసంక్షేమం కోసం పాటుపడాలని సూచించారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, మండ్ల ఈశ్వరయ్య, బండారు శ్రీనివాసులు, భాస్కరగౌడ్, సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో అగ్నిప్రవేశ మహోత్సవం

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో కొలువైవున్న శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం అమ్మవారి అగ్నిప్రవేశాన్ని పురస్కరించుకుని అమ్మవారి భక్తులు నిప్పులగుండంలో నడిచారు. ఆలయంలో అగ్నిప్రవేశ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కన్య, సుహాసిని పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమగుండంలో పూర్ణాహుతి సమర్పణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా దేవస్థానం ప్రధానార్చకులు లలితా శివయ్యస్వామి పర్యవేక్షణలో నిర్వహించారు. ఉదయం పినాకిని తీర్థ గ్రహణం, గణపతిపూజ, కలశ స్థాపన, చండీహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

# నేత్రపర్వంగా..శ్రీనివాస కళ్యాణం

శ్రీవారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని గతనెల 28న నెల్లూరులోని టిటిడి కళ్యాణమండపంలో నేత్రపర్వంగా శ్రీనివాస కళ్యాణం నిర్వహించారు. టిటిడి అర్చకుడు వేదగిరి ఫణిశర్మ ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ వేడుకలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కళ్యాణ మహోత్సవం అనంతరం కన్నులపండువగా స్వామివార్లకు పుష్పయాగం జరిగింది. ఉభయకర్తలుగా విజయలక్ష్మి, సుబ్రహ్మణ్యం, సుజన, శేషగిరి, హైందవి, బాలానందరెడ్డి, కొండా శేఖరరెడ్డి, నీరజ, వొమ్మిన సతీష్, భానుమతి వ్యవహరించగా, భక్తిసంగీత గాయకుడు గుండాల గురవయ్య ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు భక్తులను అలరించాయి. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. తొలుత కళ్యాణమండపం ప్రాంగణంలో గోపూజను నిర్వహించారు. టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా కో-ఆర్డినేటర్ డా. మల్లెల శ్రీహరి, దేవరాజులు, శివప్ప, హిందూ ధర్మప్రచార మండలి అధ్యక్ష ఉపాధ్యక్షులు సివి సుబ్రహ్మణ్యం, కొండా శేఖరరెడ్డి, సభ్యులు వేమిరెడ్డి సనత్‌కుమార్‌రెడ్డి, దుర్గాప్రసాద్, ఆలూరు శిరోమణి శర్మ, కొండెపి గిరిజాకుమారి తదితరులు పాల్గొన్నారు.




# చంద్రబాబు నియంతధోరణి

అమ్మ పెట్టదు, అడుక్కోనివ్వదు అన్నట్లుగా ఉంది రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవహారం. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే దానికి కొన్ని ప్రత్యేక అవకాశాలుండాలి. విదేశీ పెట్టుబడులు, పారిశ్రామికవేత్తలు చంద్రబాబు అందం చూసి పరుగెత్తరు, పారిశ్రామిక రాయితీలు ఇవ్వాలి. పన్నుల్లో మినహాయింపులుండాలి. మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఇవన్నీ కూడా ఒక్క ప్రత్యేకహోదాతో సాధ్యమవుతాయి. చంద్రబాబు దానిని వదిలేసి ప్రత్యేకప్యాకేజీ కోసం పాకులాడడం కేవలం కమిషన్‌ల కోసమే! ప్రత్యేకహోదా సాధిస్తే పెట్టుబడుల కోసం దావోస్ పోనక్కరలేదు. వాణిజ్య భాగస్వామ్య సదస్సులు పెట్టనక్కరలేదు. ఏపికి పెట్టుబడులు వాటంతటవే వస్తాయి. చంద్రబాబు ఆ విషయాన్ని మాత్రం విస్మరించి, ప్రత్యేకహోదా ఉద్యమానికి మద్దతు పలకాల్సిందిపోయి, ఉద్యమం పట్ల నియంతృత్వ వైఖరి అవలంభించడం శోచనీయం.

**- షేక్ నజీర్, నెల్లూరు.**

# నోట్ల రద్దు ప్రయోజనాలేవి?

పెద్దనోట్ల రద్దు గడువు తర్వాత ఆ ప్రయోజనాలేంటో చూస్తారని ప్రధాని నరేంద్రమోడీ చెప్పారు. తనకు 50రోజుల గడువు ఇమ్మన్నారు. కష్టాలు భరించాలని ప్రజలను కోరారు. ప్రజలు భరించారు. మరి గడువు తీరిపోయి ఇంకో నెల కూడా అయ్యింది. మోడీ ఆ ప్రయోజనాలేంటో ఇంతవరకు చెప్పట్లేదు. పెద్దనోట్ల రద్దు వల్ల ఆయా వ్యాపార రంగాలు మాత్రం తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా చాలామంది ఉద్యోగాలు కోల్పోయారు. మోడీ మాటల ప్రధానే గాని చేతల ప్రధాని కాదని అర్థమవుతోంది.

**కె.సుజాత, నెల్లూరు.**

# దరిద్రంగా రోడ్డు

నెల్లూరుకు జూబ్లీహిల్స్ లాంటి మాగుంట లే అవుట్‌లో మెయిన్‌రోడ్డు గుంతులమయమైంది. సెలబ్రేషన్స్ టిఫిన్స్ నుండి బెజవాడ గోపాలరెడ్డి బొమ్మ వరకు ఈ రోడ్డుపై వాహనాలు పోవడం కష్టంగా వుంది. ప్రతి రోజూ విఐపిలు ఎక్కువుగా తిరిగే రోడ్డు ఇది. అలాగే ఆర్టీసీ నుండి కావలి, ఆత్మకూరు వైపు వెళ్లే అన్ని బస్సులు కూడా ఇటే పోతుంటాయి. కాబట్టి ఈ రోడ్డును వెంటనే బాగుచేయగలరు.

**బి.నరేష్, నెల్లూరు.**



కొత్త సంవత్సరం ఆరంభంలోనే కొత్త వ్యాధులు జిల్లా ప్రజలను భయపెడుతున్నాయి. చికున్‌గున్యా, మలేరియా, అతిసార, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రతిఏటా జిల్లా ప్రజలను చుట్టం చూపుగా వచ్చి పలకరించిపోతుంటాయి. ఇప్పుడు చుట్టపు చూపుగా వచ్చే రోగాల్లో స్వైన్‌ఫ్లూ కూడా చేరడం జిల్లా ప్రజల్లో ఆందోళన రేకెత్తిస్తోంది.

# జిల్లాలో 'స్వైన్' విహారం

ఈ సీజన్‌లో వ్యాధులు వస్తేనే జిల్లాలో డాక్టర్లకు గాని, లేబొరేటరీలకు గాని, మందుల షాపుల వాళ్లకు గాని పెద్దపండుగ లెక్క! క్రమం తప్పకుండా ఈ రోగాలు వస్తుండబట్టే నెల్లూరుజిల్లాలో చాలా మంది డాక్టర్లు స్థిరాస్థులు పెంచుకోగలుగుతున్నారు. కట్టిన కార్పొరేట్ ఆసుపత్రులకు సక్రమంగా బ్యాంకులకు ఈఎంఐలు కట్టగలుగుతున్నారు. స్వైన్‌ఫ్లూ ప్రాణానికే ప్రమాదం. ఈ రోగం రాకుండా నివారించడం ఉత్తమ మార్గం. స్వైన్‌ఫ్లూ బారిన పడ్డారంటే, దానికి తగ్గ వైద్యసదుపాయాలు నెల్లూరులో లేవు. చెన్నై వంటి నగరాలలో కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా ఖచ్చితంగా ఈ రోగం తగ్గుతుందన్న నమ్మకం లేదు.

జిల్లాలో మొన్ననే ఓజిలి, తడ మండలాల్లో స్వైన్‌ఫ్లూ కేసులు బయటపడ్డాయి. కాగా, తాజాగా కావలి మున్సిపాల్టీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్న బోరెడ్డి రాధామోహన్‌రెడ్డి(40) స్వైన్‌ఫ్లూతో చెన్నైలోని విజయ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కావలి పట్టణంలోనే మరో వ్యక్తి స్వైన్‌ఫ్లూతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ సంఘటనలతో కావలి పట్టణంలోనూ భయాందోళనలు నెలకొంటున్నాయి.

జిల్లాలో స్వైన్‌ఫ్లూ కేసులు బయటపడుతున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తం కావాల్సివుంది. స్వైన్‌ఫ్లూ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. దాహం వేసాక బోరు వేయించుకుందాం అన్నట్లుగా ఉండే వైద్యఆరోగ్యశాఖ దీనిపై తక్షణం స్పందించాలి. స్వైన్‌ఫ్లూపై అవగాహన సదస్సులు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి.

నెల్లూరు నగరంతోపాటు పలు పట్టణాలు, గ్రామాల్లో మనుషులతో కలిసి పందులు కూడా నివసిస్తున్నాయి. పందుల ఏరివేతపై నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు ఏ మున్సిపాల్టీవాళ్లు కూడా పట్టించుకోవడం లేదు. స్వైన్‌ఫ్లూ వైరస్ అన్నది పందుల నుండే వస్తుంది. జనావాస ప్రాంతాల్లో పందుల సంచారం లేకుండా చేయాలి. ముఖ్యంగా జిల్లా కలెక్టర్ గట్టిగా అదిలిస్తేగాని వైద్యఆరోగ్య సిబ్బంది ఈ విషయంపై కదిలి పని చేయరు.

# అంతుబట్టని అజీజ్



## అటు లోకేష్ భజన.. ఇటు వైసిపితో మంతనాలు!

*ఎవ్వరి మాటా వినడు ఈ సీతయ్య అన్నటైపులో తయారయ్యాడు నెల్లూరు మేయర్ అజీజ్. నాకెవరూ బాస్‌లు లేరు. నాకు నేనే బాస్‌ని అన్నట్లుగా వ్యవహరిస్తూ తన పార్టీ వాళ్లకు, తనను పార్టీలోకి తీసుకొచ్చిన వాళ్లకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాడు. జిల్లా తెలుగుదేశం పార్టీలో ఏ ఒక్క నాయకుడితోనూ ఆయనకు సఖ్యత, సమన్వయం లేకుండా పోయాయి. సోమిరెడ్డి, ఆదాల, బీద... ఇలా అందరితో దూరమే! ఆనం అంటే ముందు నుండీ పడదు. సరే, వీళ్లందరినీ పక్కనపెట్టినా తనను పార్టీలోకి తీసుకొచ్చిన మంత్రి నారాయణతోనన్నా బాగుంటున్నాడా? ఆయన మాటకు గౌరవమిస్తున్నాడా అంటే అదీ లేదు. మంత్రి నారాయణ అంటే ఆయనకు బొటనవేలి మీద వెంట్రుకతో సమానమైంది. మేయర్‌కు మంత్రితో పాటు ముఖ్యమైన జిల్లా తెలుగుదేశం నాయకులతో సఖ్యత లేదు. తన పార్టీ కార్పొరేటర్ల మద్దతు లేదు. అయినా అజీజ్ అందరినీ ఢీకొంటున్నాడు. ప్రతి ఒక్కరితో కయ్యానికి సై అంటున్నాడు. అతని ధైర్యానికి కారణమేంటి? అతను ఆడుతున్న గేమ్ ఏంటి?*

అతనికి జిల్లా తెలుగుదేశం నాయకులతో సఖ్యత లేకపోయినా తెలుగుదేశం యువరాజు లోకేష్‌తో సన్నిహితంగా ఉంటున్నాడు. తనపై లోకేష్ బ్రాండ్ వేయించుకునే ప్రయత్నంలో ఉన్నాడు. అజీజ్‌కు మైనార్టీ ముద్ర కూడా కలిసొచ్చే అంశం. వచ్చే ఎన్నికల్లో మైనార్టీ కోటా నుండి నెల్లూరు నగరం సీటును దక్కించుకోవాలని అతని ప్లాన్. అందుకు లోకేష్ ఆశీస్సులుంటేచాలని నమ్మకం. కాబట్టే లోకేష్‌ను కాకా పడుతున్నాడు. అదే సమయంలో నెల్లూరు కార్పొరేషన్‌లో వైకాపా వారితో మంతనాలకు తెరతీసి డబుల్ గేమ్ ఆడుతున్నాడు. పార్టీ మారి తప్పు చేసానని, వైకాపా కార్పొరేటర్లు సహకరిస్తే కార్పొరేషన్‌లో తెలుగుదేశం వాళ్లతో ఫుట్‌బాల్ ఆడుకుంటానంటున్నాడు. ఈమేరకు కార్పొరేషన్‌లో వైకాపా ప్రతినిధులుగా వ్యవహరించే పి.రూప్‌కుమార్‌యాదవ్, బొబ్బల శ్రీనివాసయాదవ్‌ల సహకారం అభ్యర్థించాడు. అయితే ఒకసారి అజీజ్ చేతిలో మోసపోయిన వాళ్లు మళ్లీ అంత తొందరగా అజీజ్‌ను నమ్మలేరుగా! అదీగాక ఈ విషయంలో వైకాపా ఎమ్మెల్యేలు కోటంరెడ్డి, అనిల్‌ల నిర్ణయమే కీలకం. అజీజ్ తెలుగుదేశంలోనే వుంటే ఆయనకు సహకరించినంత మాత్రాన వైకాపాకు అదనంగా వచ్చే ప్రయోజనమేదీ లేదు.

రాజకీయంగా మంత్రి నారాయణకు ఇంతవరకు ఎవరితోనూ పెద్ద ఇబ్బంది రాలేదు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు తనపై తీవ్ర ఆరోపణలు చేసినప్పుడు కూడా ఆయన ఏదో నాలుగు సినిమా డైలాగ్‌లు వదిలి సరిపెట్టుకున్నాడు గాని, వారితో తీవ్రమైన రాజకీయ యుద్ధం జరిపింది లేదు. అజీజ్ రూపంలో ఎదురైన సవాలే మంత్రి నారాయణను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. అజీజ్‌పై ఏదన్నా చర్య తీసుకుందామా? అంటే మైనార్టీ ముద్ర అడ్డమొస్తోంది. అలాగని చూస్తూ వదిలేస్తే సొంత కార్పొరేషన్‌లో అడ్డం తిరిగిన మేయర్‌నే ఏం పీకలేని నారాయణ ఇక మంత్రిగా ఏం వెలగబెడతాడనే ప్రశ్న వస్తుంది! మొత్తానికి అజీజ్ వైఖరితో జిల్లా తెలుగుదేశంలోనే అంతర్మథనం మొదలైందని చెప్పొచ్చు.

# తీరిన నగదు కష్టాలు
# ఆగని వ్యాపార నష్టాలు

**పెద్దనోట్ల రద్దు ప్రభావం నుండి ప్రజలు ఇప్పుడిప్పుడే బయటపడుతున్నారు. బ్యాంకుల ముందు, ఏటిఎంల ముందు క్యూలు లేవు. బ్యాంకుల్లో అడిగిన వారికి అడిగినంత కాకపోయినా అవసరాల మేరకు డబ్బులు ఇస్తున్నారు. ఆర్బీఐ నిబంధనల మేరకు బ్యాంకుల్లో నగదు చెల్లింపులు జరుగుతున్నాయి. 2వేల నోట్ల కంటే కూడా కొత్త 500నోట్లు బాగానే చెలామణిలోకి రావడంతో చిల్లర కష్టాలు తీరాయి. వ్యాపారాలు సాధారణ స్థితిలో జరుగుతున్నాయి. కరెన్సీ కష్టాలు చాలావరకు తీరినట్లే! మరి వ్యాపారంలో వస్తున్న నష్టాలను తగ్గించుకునేదెట్లా? పెద్దనోట్ల రద్దు మూలంగా స్థంభించిపోయిన వ్యాపార లావాదేవీలను తిరిగి పట్టాలెక్కించేదెట్లా? ఇదీ పెద్ద ప్రశ్నగా మారింది.**

పెద్దనోట్ల రద్దు మూలంగా బంగారం వ్యాపారం బాగా దెబ్బతింది. నల్లధనం బాగా చెలామణి అయ్యేది బంగారం కొనుగోళ్లలోనే! నోట్ల రద్దు తర్వాత కేంద్రం బంగారం కొనుగోలుకు పాన్‌కార్డును సమర్పించాలన్న నిబంధనను తప్పనిసరి చేసింది. పాన్‌కార్డు ఇవ్వడమంటే బంగారం ఎంతకు కొంటున్నారన్నది రికార్డవుతుంది. దీనికి సంబంధించి ఆదాయపన్ను వివరాలు అన్నీ ఉండాలి. దీంతో కొనుగోలుదారులు బంగారం కొనడం తగ్గించేసారు. బంగారం అమ్మకాలు పడిపోవడంతో వ్యాపారులు లాభాలు పోయి నష్టాల్లో కొనసాగే పరిస్థితి.

నోట్ల రద్దుకు ప్రధానంగా బలైంది రియల్‌ఎస్టేట్ వ్యాపారం. ఈరోజు దేశంలోనే వ్యవసాయం తర్వాత ప్రత్యక్షంగా గాని పరోక్షంగాగాని ఎక్కువ శాతం మందికి వ్యాపారం, ఉపాధి కల్పిస్తున్న రంగమిది. ఒకరకంగా ఈరోజు రైతుల భూములకు విలువ తెచ్చింది కూడా ఈ రియల్ ఎస్టేటే! మనం వాడే గుండుసూది నుండి ప్రతిఒక్క వస్తువుకు ఈరోజు రియల్ ఎస్టేట్‌తో అనుబంధమేర్పడింది. ప్రభుత్వ ఆదాయ వనరుల్లో రియల్‌ఎస్టేట్ ఒక భాగమైంది. పెద్దనోట్ల రద్దుకు ముందు రాష్ట్రంలో జిల్లా వారీగా రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం చూడమనండి, నోట్ల రద్దు తర్వాత ఈ మూడునెలల ఆదాయం చూడమనండి! రియల్ ఎస్టేట్ వల్ల రిజిస్ట్రార్ శాఖ ఆదాయం ఎంతగా పడిపోయిందో తెలుస్తుంది. ప్రభుత్వానికి ఆదాయాన్నిస్తూ, ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆయా వృత్తి వ్యాపార రంగాలకు ఆర్థిక మార్గంగా వున్న రియల్ ఎస్టేట్ మాత్రం పెద్దనోట్ల రద్దు ప్రభావం నుండి ఇంకా తెప్పరిల్లుకోలేదు. ఇది ఎక్కువుగా బ్లాక్‌మనీ మీద ఆధారపడిన రంగం. ఇప్పుడు బ్లాక్ అంతా బ్యాంకుల్లో వుంది. ఆంక్షలను అధిగమించి బ్లాక్ బయటకు రావడం కష్టం. అందుకే 'రియల్'కు ఈ కష్టనష్టాలు.




# నెల్లూరు కబుర్లు

## సరదాగా కాసేపు...

### భాయ్... భలే వుందిరా ఛాయ్...



జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ మంగళవారం కొద్దిసేపు ఏఆర్ సిబ్బందితో సరదాగా గడిపారు. పోలీస్‌గ్రౌండ్ వద్దగల పోలీసు పెట్రోల్ బంకు వద్దకు వెళ్లిన ఆయన, ఎదురుగా వున్న టీ బంకు వద్ద పోలీసులు టీ తాగుతుండడాన్ని చూసారు. ఆయన కూడా అక్కడకు వెళ్లి, వారితో కలిసి టీ తాగారు. వారితో సెల్ఫీలు కూడా దిగి తన పోలీస్ సిబ్బందిని ఆనందపరిచారు.

### యువ చార్టర్డ్ అకౌంటెంట్

## చిన్ని శ్రావణ్‌కుమార్‌కు సత్కారం




ఒంగోలు చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా చాప్టర్ ప్రత్యేక ఆహ్వానం మేరకు నెల్లూరుకు చెందిన యువ చార్టర్డ్ అకౌంటెంట్ చిన్ని శ్రావణ్‌కుమార్ జిఎస్‌టి చట్టంపై ప్రసంగించి అవగాహన కల్పించారు. నెల్లూరు చాప్టర్ నుంచి తొలిసారిగా ఆహ్వానం అందడం జిఎస్‌టిపై ఒంగోలు చాప్టర్ చార్టర్డ్ అకౌంటెంట్స్‌కు అవగాహన కల్పించడాన్ని పలువురు హర్షించారు. ఆ సందర్భంగా ఒంగోలు చార్టర్డ్ అకౌంటెంట్స్ చిన్ని శ్రావణ్‌కుమార్‌ను సత్కరించారు.

## కాంగ్రెస్‌లో చేరిన ఆప్ కార్యకర్తలు



జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య సమక్షంలో నెల్లూరు 54వ డివిజన్‌కు చెందిన ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు సయ్యద్ ఇబ్రహీం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జనవరి 29వ తేదీ ఇందిరాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో నగర మైనార్టీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.కె.ఫయాజ్ ఆధ్వర్యంలో ఇబ్రహీంతో పాటు మరికొందరు ఆప్ కార్యకర్తలు కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు.

## హోంగార్డు కుటుంబానికి చేయూత





జిల్లా పోలీసుశాఖలో హోంగార్డుగా పనిచేస్తూ ఇటీవల మృతిచెందిన మహిళా హోంగార్డు పి.సునీత కుటుంబానికి 2,31,200రూపాయల ఆర్థిక సాయాన్ని సోమవారం జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ అందజేశారు. జిల్లాలోని హోంగార్డులందరూ ఒకరోజు వేతనం ద్వారా వచ్చిన ఈ విరాళాన్ని చెక్కురూపంలో సిద్ధం చేసి ఎస్పీ చేతుల మీదుగా సునీత కుమార్తె కె.గీతాంజలికి అందించారు.

అలాగే నెల్లూరు 4వ టౌన్‌లో ఏఎస్‌ఐగా పనిచేస్తూ గత ఏడాది నవంబర్ 19వ తేదీన అనారోగ్యంతో మృతి చెందిన ఎం.నిరంజన్‌రెడ్డి కుటుంబసభ్యులకు కూడా ప్రభుత్వం నుండి వచ్చిన 3,99,685రూపాయల భద్రతా ఎక్స్‌గ్రేషియా చెక్కును ఎస్పీ అందజేశారు.

## నెల్లూరులో శిక్షణ ఐఏఎస్‌లు

2016 బ్యాచ్‌కు చెందిన ముగ్గురు ట్రైనీ ఐఏఎస్‌లు వైభవ్ చౌదరి, చందన్ కుమార్, వివేక్ దత్తాత్రేయ జెష్మన్‌లు నెల్లూరుకొచ్చారు. జిల్లా కలెక్టర్ ముత్యాల రాజును కలిసారు. గత వారంరోజులుగా జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో వారు శిక్షణ పొందుతున్నారు.

### రంగనాథుడి సేవలో

## థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ

తెలుగు సినీ పరిశ్రమలో థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ డైలాగ్‌తో పాపులరైన నటుడు పృథ్వీరాజ్ జనవరి 28వ తేదీ నెల్లూరొచ్చారు. కుటుంబసభ్యులతో కలిసి శ్రీ తల్పగిరి రంగనాథస్వామిని దర్శించుకుని, పూజలు నిర్వహించారు. రోడ్డు మార్గాన తిరుపతికి వెళుతూ రంగనాథుడి దర్శనార్థం నెల్లూరులో ఆగారు.

## ఆ గాంధీకి ఆదరణేది

సోమవారం పూజ్య బాపూజీ 69వ వర్ధంతి. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ఆయా స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంఘాల వాళ్లు ట్రంకురోడ్డులోని గాంధీ విగ్రహానికి దండిగానే దండలు వేసి దండం పెట్టుకున్నారు. అదే సమయంలో సంతపేటలోని పాత మున్సిపల్ కార్యాలయంలో వున్న గాంధీ విగ్రహాన్ని విస్మరించారు. కనీసం ఆ విగ్రహానికి ఒక దండేసి దండం పెట్టుకున్నోళ్లు లేరు. ఇంతకుముందు మున్సిపల్ కార్యాలయం ఇక్కడున్నప్పుడు గాంధీ జయంతి, వర్ధంతిలకు ఈ విగ్రహానికి క్రమం తప్పకుండా పూలమాలలు వేసి నివాళులర్పించేవాళ్లు. కార్పొరేషన్ కార్యాలయాన్ని మార్చడంతో ఇక్కడ గాంధీని మర్చిపోయారు.

## అంధుల కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం




నెల్లూరు బాలాజీనగర్‌లో అంజన రూరల్ డెవలప్‌మెంట్ వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న అంధుల పాఠశాలలో స్నేహిత్ ఫౌండేషన్ వారు ఏర్పాటు చేసిన అంధుల కంప్యూటర్ ల్యాబ్‌ను గత నెల 28వ తేదీన నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ ప్రారంభించారు. అంధుల కోసం ప్రత్యేక కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేసిన వారిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎం.వి.సుబ్బారెడ్డి, కర్తం ప్రతాప్‌రెడ్డి, లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, గణేశం వెంకటేశ్వర్లురెడ్డి, మాదిరెడ్డి లక్ష్మీరెడ్డి, కె.ప్రసాద్‌రెడ్డి, ఎస్‌కె మాబు, ఎన్.సుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, సురేష్, డాక్టర్ శివ తదితరులు పాల్గొన్నారు.

## 'కిమ్స్'లో క్యాన్సర్ వైద్య శిబిరం



నెల్లూరులోని కిమ్స్(బొల్లినేని) ఆసుపత్రిలో గత నెల 28వ తేదీన ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్న అంకాలజిస్ట్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ నాగేంద్ర పర్వతనేని ఈ శిబిరంలో పాల్గొని 186 మంది క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను పరీక్షించారు. 50శాతం రాయితీతో వారికి అవసరమైన వైద్యపరీక్షలు కూడా నిర్వహించారు. అవసరమైన వారికి క్యాన్సర్ శస్త్ర చికిత్సలను సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేస్తామని డాక్టర్ నాగేంద్ర తెలిపారు. ఈ శిబిరంలో ఆసుపత్రి ఇ.డి టి.గిరినాయుడు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జె.రంగారావులు కూడా పాల్గొన్నారు.

## జైజై మంటూ సాగిన జగన్నాథ జైత్రయాత్ర



జై జగన్నాథ... జైజై జగన్నాథ నామ స్మరణలతో సింహపురి నగర వీధులు మార్మోగాయి. దేవతామూర్తుల రూపాలతో అశ్వరూఢులైన చిన్నారుల చిద్విలాసంతో, భక్తిభావం ఉట్టిపడేలా చూపరులను కట్టి పడేసే బాలబాలికల హావభావాలతో గత నెల 28న రాత్రి నెల్లూరు నగరంలో అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్యసంఘం(ఇస్కాన్) ఆధ్వర్యంలో 6వ జగన్నాథ రథయాత్ర వేడుక నేత్రపర్వంగా సాగింది. రథయాత్ర సాగే మార్గంలో మహిళలు రంగురంగుల రంగవల్లులను తీర్చిదిద్ది రథోత్సవానికి సంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. సర్వాలంకారశోభితులై రథంపై కొలువు తీరిన శ్రీకృష్ణ బలరామ సుభద్రలు భక్తులకు దర్శనమిచ్చారు. నెల్లూరు ఇస్కాన్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యాత్రను నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని హరనాథపురం సెంటర్‌లో భక్తిప్రపత్తులతో గుమ్మడికాయతో దిష్టితీసి ప్రారంభించారు. రథయాత్ర హరనాథపురం సెంటర్ నుండి ప్రారంభమై లీలామహల్, బారకాసు, చిన్నబజార్, ములుమూడి బస్టాండ్, సంతపేట, ఏ.సి.సెంటర్, ట్రంకురోడ్డు, గాంధీబొమ్మ, వీఆర్‌సి, ఆర్టీసీ సెంటర్ మీదుగా కెవిఆర్ పెట్రోల్‌బంకు నుండి శ్రీ కస్తూరిదేవి గార్డెన్స్‌కు చేరుకుంది. ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవస్వామి, దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఇస్కాన్ మందిరాల నిర్వాహకులు పాల్గొని ప్రసంగించారు. శ్రీ కస్తూరిదేవి ప్రాంగణంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో 56వంటకాలతో కూడిన నైవేద్యం సమర్పించారు. రథయాత్రలో జర్మని, రష్యా దేశాలకు చెందిన ఆరుమంది భక్తులు హాజరయ్యారు. భగవన్నామస్మరణలతో కీర్తనలు ఆలపిస్తూ, భజనల్లో పాల్గొన్నారు. భక్తులందరికీ విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది. గత ఆరేళ్లుగా ప్రతి జగన్నాథ రథయాత్రలోనూ భక్తులకు విపిఆర్ ఫౌండేషన్ వారే ప్రసాదం పంపిణీ చేస్తుండడం విశేషం.



## అమ్మపట్ల ప్రేమకు... అమ్మవారి పట్ల భక్తికి ప్రతిరూపం...

# నంబూరు సులోచనమ్మ అన్నదాన సత్రం!



నెల్లూరు వాసి, చెన్నై రియల్‌ఎస్టేట్ రంగంలో యుక్తవయస్సులోనే అద్భుతాలు సాధించిన అలయన్స్ గ్రూప్ ఛైర్మెన్ నంబూరు మనోజ్ సాయికి తన అమ్మ నంబూరు సులోచనమ్మ, తండ్రి మోహన్‌రావు అంటే ఎంతో ప్రేమ. అట్లాగే భక్తుల ఇలవేల్పు సూళ్లూరు పేటలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారు అంటే కూడా అంతే భక్తి! ఈ అమ్మవారి సన్నిధిలో తన అమ్మపేరు చిరస్థాయిగా నిలిచే ఓ మంచి ఆధ్యాత్మిక సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టాడు మనోజ్.



దేవాలయంలో ఎంతో కాలంగా అన్నదానం జరుగుతున్నా, అందుకు సరైన భవన సదుపాయం లేదు. దేవస్థానం గత పాలకవర్గ ఛైర్మెన్ ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి ద్వారా ఈ విషయం తెలుసుకున్న నెల్లూరులోని నంబూరు లేబొరేటరీస్ అధినేత నంబూరు మోహన్‌రావు, ఆయన తనయుడు నంబూరు మనోజ్‌లు తమ సొంత ఖర్చుతో దేవస్థానం ప్రాంగణంలో అన్నదాన సత్రం నిర్మాణానికి ముందుకొచ్చారు. దాదాపు 50లక్షల ఖర్చుతో అమ్మవారి ప్రాంగణంలో తన అమ్మ పేరు మీద అధునాతన భోజనశాలను నిర్మించాడు మనోజ్. ఎంతో ఆకర్షణీయంగా రూపుదిద్దుకున్న ఈ భోజనశాలను జనవరి 29వ తేదీన నీతికి, నిర్భీతికి ప్రతిరూపంలా నిలిచే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి ప్రారంభించడం ఎంతైనా సంతోషించాల్సిన విషయం. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన డబ్బు సంపాదించాల్సిన అవసరాన్ని తెలియజేస్తూ, ఆ డబ్బును పది మంది మంచి కోసం వెచ్చిస్తే దాని విలువ మరింతగా పెరుగుతుందని అన్నారు. ఇంతమంచి భోజనశాలను నిర్మించిన నంబూరు కుటుంబసభ్యులను ఆయన అభినందించారు.

దేవస్థానం పాలకమండలి ఛైర్మెన్ ముప్పాళ్ల వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో శాసనమండలి సభ్యులు వాకాటి నారాయణరెడ్డి, మాజీ మంత్రి పరసారత్నం, మాజీఎమ్మెల్యే తాటిపర్తి చెంచురెడ్డి, ఆలయ మాజీ ఛైర్మెన్‌లు బద్దెపూడి వేణుగోపాల్‌రెడ్డి, ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి, కాళంగి ప్రభాకర్, సూళ్లూరుపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎం.విజయలక్ష్మి, డి.వి.సత్రం జడ్పీటీసీ విజేత, మాజీమండలాధ్యక్షులు పిట్ల సుబ్రహ్మణ్యం, ఆలయ ఇ.ఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా భోజనశాల నిర్మాణ కర్తలు నంబూరు మోహన్‌రావు, శ్రీమతి సులోచన దంపతులను, నంబూరు మనోజ్ - లత దంపతులను ఆలయ కమిటి పక్షాన ఘనంగా సత్కరించారు.

# శ్రీసిటీలోకి పెట్టుబడుల ప్రవాహం




ఇటీవల విశాఖపట్నం వేదికగా జరిగిన సి.ఐ.ఐ భాగస్వామ్య సదస్సులో నెల్లూరు జిల్లా తడ సమీపంలోని శ్రీసిటీలో తమ పెట్టుబడులు పెట్టడానికి 13కంపెనీలు ఒప్పందం చేసుకున్నాయి. సుమారు 600కోట్ల పెట్టుబడులతో ఈ కంపెనీలు శ్రీసిటీలో తమ పరిశ్రమలను స్థాపించనున్నాయి. ఈమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో శ్రీసిటీ ఎం.డి రవీంద్రసన్నారెడ్డి, ఆయా కంపెనీల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసుకున్నారు.

మన్ పసంద్ బేవరేజస్ 150కోట్లు, స్పెయిన్‌కు చెందిన విండర్ రెన్యువబుల్స్ కంపెనీ 130కోట్లు పెట్టుబడి పెట్టనున్నాయి. ఒప్పందం చేసుకున్న 13కంపెనీలలో రెండు స్పెయిన్‌వి, ఒకటి దక్షిణ కొరియా దేశాలకు చెందినవి కాగా మిగిలినవి మన దేశానికి చెందిన కంపెనీలేనని, ఇంజనీరింగ్, ఇంధనం, పారిశ్రామిక రసాయనాలు, పరిశోధన, వినిమయ వస్తువులు, లాజిస్టిక్, ఆహార శుద్ధి, పానియాల వంటి ఉత్పత్తులకు సంబంధించిన పరిశ్రమలను శ్రీసిటీలో నెలకొల్పుతారని, వీటి ద్వారా 2వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని శ్రీసిటీ యం.డి రవీంద్ర సన్నారెడ్డి పేర్కొన్నారు.




## ప్రథమ వర్ధంతి



నిష్కల్మషి, నిస్వార్థసేవాతత్పరుడు, నిరంతర ప్రజాసేవకుడు

**చిట్టమూరు పద్మనాభరెడ్డి గారు**

(మాజీ వైస్‌ఛైర్మెన్, జిల్లా ప్రజాపరిషత్, నెల్లూరుజిల్లా)

పరమపదించి తేది. 9.2.2017 నాటికి ఏడాది గడుస్తుంది.

వారి దివ్యస్మృతికి అంజలి ఘటిస్తూ...

**చిట్టమూరు అనసూయమ్మ** - భార్య

**డా॥ చిల్లకూరు మోహన్‌రెడ్డి**, చెన్నై - బావమరిది

**ప్రొ॥ సి.యం.కె.రెడ్డి**, చెన్నై - అల్లుడు

**చిల్లకూరు నిర్మల** - కుమార్తె

**డా॥ చిట్టమూరు భారతి**, చెన్నై - కోడలు

**డా॥ చిల్లకూరు కిషోర్**, చెన్నై - మనుమడు

**కొవ్వూరు హరిత**, కాకినాడ - మనుమరాలు

**చిట్టమూరు ప్రణీత**, USA - మనుమరాలు

**చిట్టమూరు లోహిత్**, చెన్నై - మనుమడు

# స్టేటస్‌లో స్పెషల్ లేదు

## - ప్యాకేజీయే బెటరన్న రవిచంద్ర



రాష్ట్రానికి స్పెషల్ స్టేటస్ ఇచ్చినందువల్ల ప్రత్యేకంగా ఒరిగేదేమీ లేదంటూ చెప్పుకొచ్చాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బీద రవిచంద్ర. మొన్న నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం పెట్టి మరీ ఈ విషయం చెప్పారాయన. ప్రత్యేక హోదా అమలులో ఉన్న 11 రాష్ట్రాల్లో ఆశించిన అభివృద్ధి లేదని పెదవి విరిచారు. ప్రత్యేకహోదా సెంటిమెంట్ మాకూ వుంది. అయితే హోదా బెటరా, ప్యాకేజీ బెటరా అని బేరీజు వేసుకున్నప్పుడు ప్యాకేజీయే మేలని తేలింది. అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేకప్యాకేజీతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనుకున్నారు. ఈ ప్యాకేజీకి ఒప్పుకోబట్టే పోలవరంకు 55వేల కోట్లు తెచ్చుకోగలుగుతున్నామని రవిచంద్ర అన్నారు. ప్రత్యేకహోదా కంటే ప్రత్యేక ప్యాకేజీ ఏ విధంగా మేలో భవిష్యత్‌లో అభివృద్ధి ద్వారా చూపిస్తామని రవిచంద్ర ఆత్మవిశ్వాసంతో చెప్పారు.

# సమాజసేవలో రోటరీక్లబ్



నెల్లూరులోని రోటరీ క్లబ్ సమాజసేవలో ఎంతో ముందుంటోందని, రోటరీ సేవలు అభినందనీయమని జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, నగర మేయర్ అబ్దుల్ అజీజ్ ప్రశంసించారు. స్థానిక బోడిగాడితోటలో 60 లక్షలతో నిర్మించిన దహనవాటికలను వారు ఇటీవల ప్రారంభిస్తూ రోటరీ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఛైర్మెన్ రాఘవేంద్రశెట్టి, కార్పొరేటర్లు మామిడాల మధు, అంచూరు జానకి, రొటేరియన్ శ్రీహరిరెడ్డి, రోటరీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, కార్యదర్శులు వేలూరు శ్రీనివాసులు, ప్రతాప్‌కుమార్‌రెడ్డి, నరసింహారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## దుష్టపాలనతో...

# కార్పొరేషన్‌ను భ్రష్టు పట్టిస్తున్నారు

## - వైఎస్సార్సీపి నేతల ధ్వజం



నెల్లూరు నగరపాలకసంస్థను అధికారపార్టీ భ్రష్టుపట్టిస్తోందని, ఆ పార్టీలో వర్గ విభేదాలతో కార్పొరేషన్ పరిస్థితి అస్తవ్యస్తంగంగా తయారవుతోందని, ఫలితంగా ఎస్సీ సబ్‌ప్లాన్ పనులు టెండర్లకే పరిమితమైపోయాయే తప్ప ఆచరణలోకి రాలేదని వైఎస్సార్సీపి నేతలు, కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ రూప్‌కుమార్‌యాదవ్, పార్టీ విప్ బొబ్బల శ్రీనివాసయాదవ్‌లు తీవ్రంగా ధ్వజమెత్తారు. గత నెల 28న వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఎస్సీ సబ్‌ప్లాన్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని తామెంతో కాలం నుంచి కోరుతున్నా పట్టించుకునేవారే లేరని మండిపడ్డారు. 40 శాతం దళితులు నివసించే డివిజన్లలో మాత్రమే సబ్‌ప్లాన్ నిధులతో పనులు చేపట్టాలనే నిబంధనలున్నా, ఆ నిధులను ప్రతి డివిజన్‌కు కోటి రూపాయల వంతున కేటాయించేందుకు అధికారపార్టీ నిర్ణయించడం దారుణమని వారు విమర్శించారు. ఇలా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే తాము సహించేది లేదన్నారు. మంత్రి నారాయణ కార్పొరేషన్‌కు గత మూడు నెలలుగా రెగ్యులర్ కమిషన్‌ను నియమించలేకపోవడం విచారకరమన్నారు. బిల్లులపై సంతకాలు చేసేవారు లేకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను నిలిపేస్తున్నారని, అభివృద్ధి పనులు మందగించిపోతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం దారుణమని వారు విమర్శించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, గోగుల నాగరాజు, ఖలీల్ అహ్మద్, దేవరకొండ అశోక్, నాయకులు వేలూరు మహేష్, వందవాసి రంగ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

# చదువులతో పాటు క్రీడలూ ముఖ్యమే

## - చదలవాడ కృష్ణమూర్తి

విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యతనివ్వాలని, ప్రతి ఒక్కరూ పోటీ తత్వాన్ని అలవరచుకోవాలని తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి అన్నారు. గూడూరు పట్టణంలో సోమవారం నిర్వహించిన గ్రీన్‌వ్యాలీ పాఠశాల వార్షికోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయనతో పాటు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మి, డిసిసి అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య, పాఠశాల కరస్పాండెంట్ కె.ఆర్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి కలలను సాకారం చేయాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను నెరవేర్చుకునేందుకు పట్టుదలతో కృషి చేయాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తిని పాఠశాల కరస్పాండెంట్ కె.ఆర్.రెడ్డి ఘనంగా సత్కరించారు. పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

# లిటిల్ ఏంజెల్స్ వార్షికోత్సవం




గూడూరు శారదానగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్లో 32వ వార్షికోత్సవ వేడుకలను ఇటీవల ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గూడూరు డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్, డిఎస్పీ శ్రీమతి ఇందిర, న్యాయమూర్తి దివాకర్, డిఇఓ మువ్వా రామలింగం, కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి, పేరంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు దయాకర్‌రెడ్డి, కె.మునిగిరీష్ తదితరులు పాల్గొన్నారు.



పల్స్‌పోలియో సందర్భంగా జనవరి 29వ తేదీన గూడూరులో పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, అదనపు డిఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ ఈదూరు సుధాకర్ తదితరులు

# ప్రజా సమస్యలే ప్రధానం

## - ఆర్డీవో అరుణ్‌బాబు



ప్రతి సమస్యను పరిష్కరించేందుకు క్షేత్ర స్థాయిలో పరిశీలించి న్యాయం చేస్తామని గూడూరు ఆర్డీవో అరుణ్‌బాబు అన్నారు. గూడూరు డివిజన్‌కు చెందిన పలువురు ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇటీవల సబ్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సమస్యను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అనంతరం ఆర్డీవో తన కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. డివిజన్‌లోని పలు మండలాలకు చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు, రెవెన్యూశాఖాధికారులు కొత్తగా విధుల్లో చేరిన ఆర్డీవో అరుణ్‌బాబును కలిసి పుష్పగుచ్ఛాలందించి శుభాకాంక్షలు తెలిపారు.

## డ్రైవర్ల అప్రమత్తతో

# ప్రమాదాలు దూరం

డ్రైవర్లు వాహనాలను నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను సంపూర్ణంగా నివారించవచ్చునని డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవ ముగింపు కార్యక్రమాన్ని ఆర్టీసీ డిఎం అనిల్‌కుమార్ ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్నప్పుడు ఎటువంటి ప్రమాదాలు జరగనివ్వకుండా ప్రయాణీకులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్లకే ఉందని తెలియజేశారు. వాహనాలు నడిపే సమయంలో సేఫ్టీ డ్రైవ్ గురించి వివరించారు. గూడూరు ఆర్టీసీ డిపోలో ఇంతవరకు చిన్నపాటి ప్రమాదం చేయని డ్రైవర్లు యూఎస్ మణ్యం, వి.వి.శేషయ్య, వి.ఎం. నాయుడులకు బహుమతులు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నారాయణ, సుబ్బయ్య, యూనియన్ నాయకులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

# పోర్టులో పతంజలి




అగ్గిపుల్ల అమ్ముకోవడానికైనా, సబ్బు బిళ్ల అమ్ముకోవడానికైనా ఈరోజు ఆయా ఉత్పత్తుల కంపెనీలు కోట్లాది రూపాయల రెమ్యూనరేషన్ ఇచ్చి స్టార్ హీరో, హీరోయిన్‌లతో ప్రకటనలు గుప్పిస్తుంటాయి. ఒక్క భారత దేశంలోనే కాదు, ప్రపంచ వ్యాప్తంగా కూడా కార్పొరేట్ కంపెనీలు తమ ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం సినీ తారలు, లేదా క్రీడాకారుల మీదనే ఎక్కువగా ఆధార పడుతుంటాయి. అలాంటి స్టార్ క్యాంపెయిన్‌ను కాదని, వస్తువుల మార్కెటింగ్‌కు తారలే అవసరం లేదని, ప్రజల్లో నమ్మకం వున్న వ్యక్తయితే చాలని నిరూపించిన స్టార్ మార్కెటింగ్ అంబాసిడర్, యోగా గురువు బాబా రాందేవ్! కేవలం ఒంటి మీద కాషాయం గుడ్డతో, పెరిగిన గడ్డంతోనే వందలు, వేల కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్న సన్యాసి ఆయన! ఈరోజు దేశంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగానూ ఆదరణ పొందుతున్న 'పతంజలి' కంపెనీ ఉత్పత్తులకు ఆయనే ప్రచారకర్త! ఆయన ప్రకటనలు చూసే ప్రజలు వేలంవెర్రిగా పతంజలి ఉత్పత్తులను కొంటున్నారు. వస్తువుల అమ్మకానికి సిక్స్‌ప్యాక్ బాడీగాని, సెక్సప్పీల్ వున్న తారలు గాని అవసరం లేదని లోకానికి చాటిన బాబా రాందేవ్ ఇప్పుడు తన వ్యాపార సామ్రాజ్య విస్తరణకు నెల్లూరుజిల్లాలోని కృష్ణపట్నం పోర్టును వేదికగా చేసుకోబోతున్నాడు. సోమవారం కృష్ణపట్నంపోర్టుకు విచ్చేసిన ఆయన దేశంలోనే అతిపెద్ద పతంజలి ఆయుర్వేద ఫుడ్‌పార్క్‌ను పోర్టు సెజ్‌లో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. పోర్టు యాజమాన్యంతో చర్చించి త్వరలోనే శంకుస్థాపన తేదీని నిర్ణయిస్తామని, ఏడాదిలోపే తమ ఫుడ్‌పార్క్‌లో వస్తువుల ఉత్పత్తిని కూడా ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోర్టు ఎం.డి చింతా శశిధర్, సి.ఇ.ఓ ఎండ్లూరి అనిల్, పి.ఆర్ హెడ్ జి.వేణుగోపాల్ పాల్గొన్నారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 3.2.2017 నుండి
తేది. 9.2.2017 వరకు

ఈ వారం మేష వృషభ మిధున కర్కాటక రాశులలో చంద్రుడు, సింహంలో రాహువు, కన్యలో గురువు, ధనుస్సులో శని, మకరంలో రవి బుధులు, కుంభంలో కేతువు, మీనంలో కుజశుక్రులు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 3 శుక్రవారము రథసప్తమి పర్వదినము.

**ముహూర్తములు**

ఫిబ్రవరి 5వ తేదీ ఆదివారం రాత్రి గంట 12.30 నుండి గంట 2.40లోగా వృశ్చికలగ్నమున గృహప్రవేశము. ఫిబ్రవరి 9తేది గురువారం రాత్రి గంట 12.17 నుండి గంట 2.23లోగా వృశ్చికలగ్నమున గృహప్రవేశము.

**మాఘ మాస శుక్లపక్ష తిధులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 3 | శుక్ర | సప్తమి | రా॥ గం.10.20వ॥ |
| తేది. 4 | శని | అష్టమి | రా॥ గం.8.03వ॥ |
| తేది. 5 | ఆది | నవమి | సా॥ గం.5.40వ॥ |
| తేది. 6 | సోమ | దశమి | సా॥ గం.3.18వ॥ |
| తేది. 7 | మంగళ | ఏకాదశి | ప॥ గం.1.02వ॥ |
| తేది. 8 | బుధ | ద్వాదశి | ఉ॥ గం.10.55వ॥ |
| తేది. 9 | గురు | త్రయోదశి | ఉ॥ గం.9.03వ॥ |

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

శుభకార్య ప్రయత్నములలో పాల్గొంటారు. ఉద్యోగార్ధులకు అవకాశాలు కలసివస్తాయి. కొత్త వసతులు సమకూర్చుకొంటారు. రాజకీయ వర్గాలకు ఇబ్బందికర దినములివి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకొనండి. కుటుంబ సౌఖ్యముంటుంది. వృత్తి వ్యాపారాలలో ఇబ్బందులు తొలగి రాబడి పెరుగుతుంది. అవసరాలు ఏదో ఒక విధంగా నెరవేరగలవు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

కోర్టు కేసులు వాయిదా పడగలవు. సభలు, సమావేశాలలో పాల్గొంటారు. ప్రముఖులతో చర్చలుండగలవు. కుటుంబసభ్యులకు గాని బంధువర్గంలో గాని అనారోగ్య బాధితులుంటారు. ఉద్యోగులకు బాగా శ్రమ పని భారం ఉంటుంది. ఉద్యోగావకాశాలు లభించగలవు. కుటుంబ సౌఖ్యము, విద్యాప్రగతి బాగుంటుంది. శుభకార్య ప్రయత్నాలను ముమ్మరంగా చేస్తారు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

దూరప్రయాణాలు, సామాజిక సేవా కార్యక్రమాలకు వెళతారు. ఉద్యోగులు అధికారులతో పబ్లిక్‌తో జాగ్రత్తగా ఉండాలి. యజమానులు వర్కర్లతో జాగ్రత్త పడండి. విద్యాప్రగతి బాగుంటుంది. రాజకీయ వర్గాల వారు విమర్శనలు ఎదుర్కొనవలసి ఉంటుంది. అనుకున్న పనులు ఆటంకాలు తొలగి సవ్యంగా జరుగుతాయి. వ్యాపారాలు అభివృద్ధి చెంది ఆదాయం పెరుగుతుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

దూరప్రయాణాలుంటాయి. కొత్త కాంట్రాక్టులు, లీజులు లభించగలవు. బంధువర్గం నుండి అనారోగ్య వార్తలు వింటారు. విద్యాప్రగతి బాగుంటుంది. ఇతరుల పనులు చేయబోయి ఇబ్బందుల్లో పడతారు. కోర్టు వ్యవహారాలు నిరుత్సాహం కలిగిస్తాయి. పంతాలు పట్టుదలకు పోకుండా పనులు జరుపుకొనాలి. ఖర్చులు ఎక్కువుగా ఉంటాయి. పరిమితి విధించుకొనండి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

కొత్త పరిచయాలు, వ్యాపకాలు పెరుగుతాయి. ఋణాలివ్వడం, హామీలివ్వడం చేయవద్దు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. పనులు నిదానంగా జరుగుతూ టెన్షన్ కలిగిస్తాయి. ఆరోగ్యం సరిగా ఉండదు. అనవసర విషయాలు, కుటుంబవ్యక్తుల పనులు ఆందోళన కలిగిస్తాయి. ఆదాయ ఖర్చులు సమతుల్యంగా ఉంటాయి. వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం పెరుగుతుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు దొరుకుతాయి. షేర్లు, స్థిరాస్తుల మీద ఆదాయం ఉంటుంది. కుటుంబ సౌఖ్యం, ఆరోగ్య పరిస్థితి బాగుంటుంది. ఉద్యోగులకు పనిభారం అధికారుల వత్తిడి ఎక్కువుగా ఉంటుంది. ముఖ్య ఆర్ధిక లావాదేవీలు వాయిదా పడతాయి. చేపట్టిన పనులు అయినవి అనిపిస్తారు. వ్యాపారాలు ప్రోత్సాహకరంగా జరుగుతాయి.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

కోర్టు కేసులు, రావలసిన బాకీలు వాయిదా పడతాయి. ఉద్యోగార్ధులకు అవకాశాలు లభించగలవు. విలువైన వస్తువులు, పత్రాలు జాగ్రత్త. తొందరపడి అతిగా విశ్వసించి ఇబ్బందులు పడతారు. విద్యా కృషి అవసరం. ఖర్చుల తాకిడి పెరుగుతుంది. శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. కుటుంబసభ్యుల పనుల వల్ల ఇబ్బందులు పడతారు. ఆదాయం సామాన్యం.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

శుభకార్యాలు నిర్ణయం కాగలవు. సామాజిక సేవ, సమావేశాలలో పాల్గొంటారు. ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేని పరిస్థితులుంటాయి. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఉద్యోగ ప్రయత్నాలలో ఇంటర్వ్యూ అవకాశాలు, అనుకోని దూరప్రయాణాలు, కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం ఉంటుంది. వ్యవహారాలు ఇంటా బయటా స్వయంగా పర్యవేక్షించండి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కుటుంబసభ్యుల సహకారం, కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఉద్యోగులు తమ అధికారులతోను పబ్లిక్‌తోనూ జాగ్రత్తగా మెలగండి. సమస్యలను రాజీమార్గంలో పరిష్కరించుకొంటే మంచిది. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. కొత్త కాంట్రాక్టులు, లీజులకు అనుకూలత బాగుంది. ఆర్థిక ఇబ్బందులుండినా డబ్బులు సర్దుబాటు కాగలవు. వృత్తివ్యాపారాల్లో సామాన్య ఆదాయం.


## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఉద్యోగులకు పనిభారం, వత్తిడి ఎక్కువగా ఉంటుంది. విద్యాప్రగతి బాగుంటుంది. వస్తు వాహన రిపేర్లుంటాయి. శుభకార్యాలు, సమావేశాలలో పాల్గొంటారు. ఆరోగ్యం జాగ్రత్త. కార్యనిర్వహణ సామర్థ్యం బాగుండినా జరుపదలచిన పనులకు ఆటంకాలుండగలవు. అందుచే కోపం టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. ఆర్ధిక ఇబ్బందులుంటాయి. కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడతారు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉన్నది. అనుకోని ప్రయాణాలుండటం, శుభవార్తలు వినడం, పెట్టుబడులు, వాణిజ్య విస్తరణకు అవకాశాలు దొరకడం ఉంటుంది. విలువైన వస్తువులు, పత్రాలు జాగ్రత్త. ఆర్ధికంగా పరిస్థితులు సంతృప్తికరం. స్థిరాస్తులు, షేర్ల మీద ఆదాయం ఉంటుంది. కొత్త పరిచయాలు బలపడి, పలుకుబడి పెరుగుతుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఉద్యోగావకాశాలు లభించగలవు. శుభవార్తలు వింటారు. ఉద్యోగులకు కార్యసామర్థ్యం, అధికారుల ఆదరణ బాగుంటుంది. విద్యాప్రగతి బాగుంటుంది. సభలు, సమావేశాలలో పాల్గొంటారు. అనుకున్న పనులు సవ్యంగా జరుగుతాయి. బంధుమిత్రులను కలుసుకొంటారు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో మంచి అభివృద్ధి, రాబడి ఉంటుంది.

# 'తెలుగువెలుగు' బస్సులో చంద్రబాబు

శ్రీను గల్పిక

ఓదార్పు వీర వై.యస్.జగన్‌మోహన్ రెడ్డి అప్పుడే కర్నూలు జిల్లాలో అప్పుల పాలై ఆత్మహత్య చేసుకున్న ఓ రైతు కుటుంబాన్ని ఓదార్చి ఇడుపులపాయకు చేరుకున్నాడు. తండ్రి వై.యస్. సమాధి వద్దకు వెళ్లి దండం పెట్టుకుని, అక్కడే వున్న గెస్ట్‌హౌస్‌కు వెళ్లాడు. అక్కడ కొండలు, పచ్చటి పైర్లు చూసి, ఆ రాత్రికి అక్కడే పడుకోవాలనిపించిందాయనకు. ఆ రాత్రికి రెండు పుల్కాలు తిని, నులక మంచం తెప్పించుకుని పొలం గట్టుమీద వేయించుకుని దానిపై నడుంవాల్చాడు. చల్లగా వీస్తున్న పైరుగాలికి ఆయనకు ప్రాణం ఎంతో హాయిగా వుంది. పెద్ద పెద్ద ఇంద్రభవనాల్లో పడుకుంటే ఈ ఆనందం వస్తుందా అని అనుకుంటూ చల్లగా నిద్రలోకి జారుకున్నాడు.

★★★★★

జగన్ నిద్ర లేచాడు. భారతి ఆయనకు బెడ్ కాఫీ అందించింది. కాఫీ తాగుతూ జగన్ 'ఈనాడు' పత్రిక చేతికి తీసుకున్నాడు. ఆ పత్రికలో హెడ్డింగ్ చూసి జగన్‌కు కళ్లు బైర్లు కమ్మాయి. 'రాష్ట్రంలో జగన్‌కు పెరుగుతున్న ప్రజాదరణ' అనే హెడ్డింగ్‌తో వార్త... దాని క్రిందనే "ప్రత్యేకహోదాకై జగన్ చేసే పోరాటానికి పూర్తి మద్దతు" అన్న హెడ్డింగ్‌తో హైటెక్‌రత్న చంద్రబాబు స్టేట్‌మెంట్! ఈ విచిత్రవార్త ఏంటబ్బా అని జగన్ ఆ వార్తను పూర్తిగా చదివాడు. కేంద్ర ప్రభుత్వంలో మిత్రపక్షంగా ఉన్నాం కాబట్టి ప్రత్యేకహోదా కోసం ప్రత్యక్షంగా పోరాడలేమని, కాబట్టి జగన్ చేసే పోరాటానికి తాము పరోక్ష మద్దతు పలుకుతామని చంద్రబాబు పత్రికా విలేకరుల సమావేశం పెట్టి మరీ చెప్పారు. ఆ వార్త చదవడంతోటే జగన్ కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఇలాంటి మహానాయకుడినా నేను ఇంతకాలం అపార్ధం చేసుకున్నాను. ఇలాంటి మంచి వ్యక్తిపైనా నేను ఇంతకాలం విమర్శలు చేసింది అని పశ్చాత్తాపడ్డాడు. తర్వాత జగనే చంద్రబాబుకు ఫోన్ చేశాడు. చంద్రబాబు అవతల ఫోన్ ఎత్తగానే, సార్, ప్రత్యేక హోదా పోరాటానికి మద్దతు పలికినందుకు కృతజ్ఞతలని జగన్ అన్నాడు. అందుకు చంద్రబాబు... హోదా పోరాటానికి పరోక్ష సహకారమిస్తాం, విశాఖ బీచ్‌లో క్యాండిల్ ప్రదర్శన పెట్టారు కదా, దానికి మా వంతుగా లక్ష క్యాండిల్స్ పంపిస్తాం, ఆ క్యాండిల్స్ మేం పంపించినట్లు ఆ వెంకయ్యనాయుడుకు తెలియనీయ వద్దు. అతను అసలే సిబిఐ ఆఫీసర్. ఆవలిస్తే పేగులు లెక్కపెట్టేరకం అని చెప్పాడు. అలాగేనంటూ జగన్ ఫోన్ పెట్టేసాడు. తర్వాత జగన్ ఏబిసిటీవీ ఛానెల్ పెట్టాడు. అప్పుడే వార్తలు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం విశాఖలో తలపెట్టిన సిఐఐ సదస్సు వాయిదా... విశాఖ వేదికగా ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేకహోదా ఉద్యమం చేస్తున్నందున, ఉద్యమానికి ఇబ్బంది కలిగించకూడదన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యూహాత్మకంగా ఈ సదస్సును వాయిదా వేయించినట్లు తెలుస్తోందని న్యూస్‌రీడర్ చదువుతున్నాడు. ఈ వార్తతో జగన్‌కు చంద్రబాబు పట్ల గౌరవం రేంజ్ ఇంకొంచెం పెరిగింది. జగన్ తర్వాత 'ఆత్మసాక్షి' ఛానెల్ పెట్టాడు. అందులో "పొదుపు ముఖ్యమంత్రి మన చంద్రబాబు" అనే అంశంతో ప్రత్యేక కథనం.. విభజన తర్వాత ఆర్ధిక మాంద్యంతో కొట్టుమిట్టాడుతున్న ఆంధ్రప్రదేశ్‌ను గట్టెక్కించడానికి మన ముఖ్యమంత్రి ఎన్నో పటిష్ట చర్యలు చేపట్టారు. ముఖ్యంగా దుబారాను అరికట్టారు. ఆంధ్రప్రదేశ్‌కు అందమైన రాజధానిని రూపాయి ఖర్చు లేకుండా నిర్మించాలనే లక్ష్యంతో ఒక్క రూపాయి నష్టపరిహారమివ్వకుండా రైతుల నుండి 33వేల ఎకరాల భూమిని సేకరించారు. రాజధానిని నిర్మించే నిర్మాణ రంగ సంస్థలకు కూడా డబ్బులిచ్చే పనిలేకుండా, ఖర్చుపెట్టిన దానికి తగ్గట్లుగా భూమి ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. అమరావతి రాజధాని శంకుస్థాపన ఖర్చును కూడా 10వేల రూపాయలకు పరిమితం చేశారు. ఇందులో వేద పండితులకు వెయ్యినూటపదహార్లు ఇవ్వగా, మిగిలిన డబ్బును ఇటుకలకు, టెంకాయలకు ఖర్చుపెట్టారు. సీఎంగా ఆయన రాష్ట్రంలో ఏ ప్రాంతానికి పర్యటనకు వెళ్లినా 'తెలుగు వెలుగు' బస్సుల్లోనే వెళుతున్నారు. ఆ బస్సుఛార్జీలు కూడా రాష్ట్ర ఖజానా నుండి కాకుండా తన జేబు నుండే తీసిస్తున్నారు. విదేశాలకు 'తెలుగువెలుగు' బస్సులు లేకపోవడం వల్లనైతేనేమీ, విదేశాలకు పోవాలంటే విమానఖర్చులు అధికంగా ఉండడం వల్లనైతేనేమీ ఆయన సీఎం అయ్యాక ఇంతవరకు విదేశీ పర్యటనలు కూడా చేయలేదు. రాష్ట్ర ఆర్ధిక వ్యవస్థపై తన మూలంగా రూపాయి కూడా భారం పడకూడదనే ఆయన ఉన్నతాశయానికి ప్రజలంతా జేజేలు పలుకుతున్నారు. ఇక గోదావరి, కృష్ణ పుష్కరాల నిర్వహణకు ఆయన పెట్టిన ఖర్చు చూసి జాతీయ నాయకులే ముక్కున వేలేసుకుంటున్నారు. గోదావరి పుష్కరాలను పదివేల నూటపదహార్లతో, కృష్ణ పుష్కరాలను పన్నెండు వేల నూటపదహార్లతో ఎంతో విజయవంతంగా నిర్వహించారు. ఇంత తక్కువ ఖర్చుతో పుష్కరాలు నిర్వహించవచ్చా...? అనే విషయం తెలిసి ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు సిగ్గుతో తలదించుకుంటున్నారు. 2014లో సీఎం అయ్యింది మొదలు చంద్రబాబునాయుడు తన పొదుపు చర్యలలో భాగంగా ఇంత వరకు విమానం ఎక్కలేదు. హెలికాప్టర్ ముఖం చూడలేదు. గ్రేట్ స్టేట్... గ్రేట్ సీఎం... అంటూ కథనం ముగించారు. తన టీవీ ఛానెల్‌లో చంద్రబాబు పొదుపు చర్యల గురించి అంతపెద్ద స్టోరీ వచ్చేసరికి జగన్‌కు ఏమీ అర్ధం కాలేదు. నిజజీవితంలో జరిగే దానికి, ఇప్పుడు జరుగుతున్నదానికి ఎక్కడా లింకు కావడం లేదు, ఏదో తేడా జరుగుతుందని మనసుకు అనిపిస్తుంది. ఈసారి ప్రాంతీయ న్యూస్‌ఛానెల్స్ కాకుండా జాతీయ ఛానెల్స్ చూద్దామని ఎన్‌డి టీవీ పెట్టాడు. న్యూఢిల్లీలో జరుగుతున్న అవార్డుల ప్రదానోత్సవ వేడుక ప్రత్యక్షప్రసారం జరుగుతోంది. ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, వెంకయ్యనాయుడు, అరుణ్‌జైట్లీలు వున్నారు. వెంకయ్యనాయుడు మైకు పట్టుకుని, రాజకీయాలలో ఉండే నాయకులకు సభ్యత, సంస్కారం, మాటల్లో మర్యాద చాలా ముఖ్యం. మనం చేసే విమర్శలు, ఆరోపణలు చాలా సంస్కారవంతంగా ఉండాలి. అసహ్యంగా, అసభ్యతగా ఉండకూడదు. ఇలా సంస్కారవంతమైన విమర్శలు చేసే నాయకులను ప్రతిఏటా ముగ్గురిని ఎంపికచేసి 'సంస్కార్ చక్ర' అవార్డులను ప్రదానం చేస్తుండడం ఆనవాయితీగా వస్తుంది. అసెంబ్లీలోనూ, బయట ఎంతో సంస్కారవంతంగా విమర్శలు చేస్తూ, నాయకులు అంటే ఇలా ఉండాలి అనేదానికి ఉదాహరణగా నిలుస్తున్న తెలుగుదేశం నాయకులు అచ్చెన్నాయుడు, బోండా ఉమామహేశ్వరరావు, యలమంచిలి బాబూరాజేంద్ర ప్రసాద్‌లను ఈ ఏడాది 'సంస్కార్‌చక్ర' అవార్డులకు ఎంపిక చేసినట్లు ప్రకటించారు. అంతే హాల్ అంతా చప్పట్లతో మార్మోగుతోంది... ఆ మైకంలో జగన్ కూడా చప్పట్లు కొట్ట సాగాడు.

నిద్రలోనే జగన్ చప్పట్లు కొట్టడాన్ని చూసిన సెక్యూరిటీ సిబ్బంది తొలుత భయపడ్డారు. వెంటనే ఒక చెంబుడు నీళ్లు తెచ్చి ఆయన ముఖాన కొట్టారు. ఆ దెబ్బకు జగన్ ఉలిక్కిపడిలేచాడు. ఒక పదినిముషాల తర్వాతగాని ఆయనకు అర్ధం కాలేదు... అప్పటిదాకా జరిగిందంతా కలని... తాను ఇడుపులపాయలో నులకమంచంపైనే వున్నాననే విషయం.

# 'నాటా'లో నెల్లూరోళ్ళు

- నెల్లూరు నుండి అమెరికా వరకు పరిమళిస్తున్న సేవా కుసుమాలు



*నెల్లూరోళ్ళు ఎక్కడున్నా తమ చిత్తశుద్ధితో, అకుంఠిత సేవాభావంతో అందరి ప్రశంసలు అందుకుంటూనే వుంటారనేందుకు అమెరికాలో వున్న నెల్లూరీయులే ఒక ఉదాహరణ. ఉత్తర అమెరికాకు చెందిన నాటా సంస్థ కార్యవర్గంలోనూ పలువురు నెల్లూరీయులు స్థానం సంపాదించుకుని తమ సేవానిరతిని చాటుకుంటూ ప్రపంచవ్యాప్తంగా నెల్లూరు సేవా పరిమళాలను వెదజల్లుతూనే వున్నారు.*

అంతర్జాతీయ స్థాయిలో ఎంతో ప్రతిష్టాత్మకమైన 'నాటా' సంస్థకు 2017-18 సంవత్సరానికి ఇటీవల ఏర్పాటైన నూతన కార్యవర్గంలో పలువురు సింహపురీయులకు సముచిత స్థానం లభించడం సింహపురిసీమకే గర్వకారణం. అమెరికాలో స్థిర పడిన నెల్లూరీయులు కొంతమంది గత కొంతకాలంగా 'నాటా'కు సేవాదృక్పథంతో తమ విశేషమైన సేవలందిస్తూనే వున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల లాస్‌వేగాస్‌లో జరిగిన ఉత్తర అమెరికా తెలుగు సమితి (నాటా) నూతన కార్యవర్గ సమావేశంలో నూతన అధ్యక్షునిగా రాజేశ్వరరెడ్డి గంగసాని ప్రమాణస్వీకారం చేయగా, బోర్డు సభ్యులు ప్రెసిడెంట్ ఎలెక్ట్‌గా నెల్లూరుసీమకు చెందిన డాక్టర్ రాఘవరెడ్డి గోసాల, అదేవిధంగా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ శ్రీధర్‌రెడ్డి కొర్సపాటి ఎన్నిక కావడం విశేషం. సెక్రటరీగా శ్రీకాంత్‌రెడ్డి పెనుమాడ, ట్రెజరర్‌గా చిన్నబాబురెడ్డి, జాయింట్ సెక్రటరీగా అన్నారెడ్డి, జాయింట్ ట్రెజరర్‌గా శ్రీనివాస్ మంగళ్ళ, ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్స్‌గా సాంబరెడ్డి, ప్రతాప్ భీమిరెడ్డి, శ్రీనివాస్ గనగోని, నేషనల్ కన్వెన్షన్ అడ్వయిజర్‌గా బాల ఇందుర్తిలను ఎన్నుకున్నారు. బోర్డు సభ్యులుగా వున్న అంజన్ కర్నాటి, అన్నారెడ్డి, బాబూరావు సామల, బాల ఇందుర్తి, చిన్నబాబురెడ్డి, ద్వారక్ వారణాసి, హరి వేల్కూర్, మల్లిక్ బండా, మల్లికార్జున్ జెర్రిపోతుల, మోహన్ కలాడి, మోహన్‌రెడ్డి తలమాటి, నారాయణరెడ్డి గండ్ర, ప్రదీప్ సామల, రాజేశ్వరరెడ్డి గంగసాని, రామసూర్యరెడ్డి, శరత్ మందపాటి, శేఖర్ కోనాల, శ్రీకాంత్‌రెడ్డి, పెనుమాడ, శ్రీనివాస్ వంగిమళ్ళ, శ్రీనివాసరెడ్డి ఆళ్ళ, శ్రీనివాసులురెడ్డి కొట్లూరు, తారాకుమార్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి మురారి, వెంకటరామిరెడ్డి శనివారపులతో పాటు, నెల్లూరు సీమకు చెందిన జనార్దన్‌రెడ్డి బోయెల్ల, ప్రసూన దోర్నాదుల, రాఘవరెడ్డి గోసాల, రఘురామిరెడ్డి ఏటుకూరు, శ్రీధర్ కొర్సపాటి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో అడ్వయిజరీ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ ప్రేమ్‌రెడ్డి, అడ్వయిజరీ కౌన్సిల్ సభ్యులు ఏవిఎన్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, ఆదిశేషారెడ్డి, డాక్టర్ స్టాన్లీరెడ్డి తదితరులు మాట్లాడుతూ, ప్రెసిడెంట్ మోహన్ మల్లం హయాంలో జరిగిన అనేక సేవాకార్యక్రమాలను, డాల్లస్ కన్వెన్షన్‌ను కొనియాడారు. డాక్టర్ రాఘవరెడ్డి గోసాల మాట్లాడుతూ, ఈ రెండేళ్లలో 2,300కుటుంబాలు నాటా సభ్యత్వం స్వీకరించడం జరిగిందని, అందుకు సహకరించిన వారందరికీ, గ్రాండ్ స్పాన్సర్‌గా వున్న డాక్టర్ ప్రేమ్‌రెడ్డికి నాటా తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. కొత్త కార్యవర్గాన్ని ఈ సందర్భంగా అందరూ హర్షధ్వానాలతో స్వాగతిస్తూ తమ అభినందనలు తెలియజేశారు.



# విద్యార్థులే దేశాభ్యున్నతికి వెన్నెముక

## - నెరసం సభలో వక్తలు



విద్యార్థులే దేశాభ్యున్నతికి వెన్నెముక అని, దేశభక్తితో విద్యార్థులు దేశప్రగతికి కృషి చేయాలని, విద్యార్థులు సాహిత్యంతో పాటు దేశభక్తిని పెంపొందించేవిధంగా నెల్లూరుజిల్లా రచయితల సంఘం (నెరసం) కార్యక్రమాలు నిర్వహిస్తుండడం ఎంతో అభినందనీయమని వక్తలు ప్రశంసించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల నెల్లూరులోని టౌన్‌హాలులో నెరసం ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వం, కవితల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభకు నెరసం అధ్యక్షులు ఏ.జయప్రకాష్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ, నెరసం గత రెండు దశాబ్దాలుగా సాహితీసేవ చేస్తోందన్నారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు, సాహిత్యం పట్ల మంచి అవగాహన కలిగించేందుకు నెరసం కృషి చేస్తోందన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన నగర డిఎస్పీ వెంకటరాముడు, ఓఎస్‌డిలు పి. పెంచలరెడ్డి, చలపతిరావు మాట్లాడుతూ నెరసం సాహితీసేవను కొనియాడారు. విద్యార్థులు అధికసంఖ్యలో ఈ పోటీల్లో పాల్గొనడం పట్ల వారు విద్యార్థులను అభినందించారు. అనంతరం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వివిధ విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో 6, 7 తరగతుల విభాగంలో ఆర్‌ఎస్‌ఆర్ స్కూల్‌కు చెందిన ఎం.దుర్గ, కె.శ్రీవర్ష, 8-9-10 తరగతుల విభాగంలో పి. అంజనాదేవి(ప్రభుత్వ బాలికల పాఠశాల), బి.జయవర్ధన్, డిగ్రీస్థాయి విభాగంలో ప్రభుత్వ బిఇడి కళాశాలకు చెందిన పి.హారిక సాయిలక్ష్మి, యు.శ్రీలత, శ్రీకృష్ణ చైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థిని బాలుసహనలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. కవితల పోటీలో డిగ్రీస్థాయి విభాగంలో ఆసూరి రోజవైష్ణవి, ఎం.రఘుపతి చంద్రలేఖ బహుమతులు సాధించగా, 8-9-10 తరగతుల విభాగంలో ఐ.ఫణీశ్వరి, షేక్ సల్మాసుల్తాన్‌లు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందుకున్నారు.

న్యాయనిర్ణేతలుగా సూర్యప్రకాశరావు, సాయికృష్ణ, సురభి రాజశేఖర్, ములుగు లక్ష్మీమైథిలి వ్యవహరించారు. అనంతరం జరిగిన కవిసమ్మేళనంలో పలువురు కవులు తమ కవితలు చదివి వినిపించారు. నెరసం ఉపాధ్యక్షుడు మాటేటి రత్నప్రసాద్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా, నెరసం కోశాధికారి ఐ.నాగరాజారావు, డిటి హరికృష్ణ, ఏ.సుధాకర్, ఓ.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# శ్రీకాళహస్తి న్యూస్

## శ్రీకాళహస్తీశ్వరాలయానికి..

# స్వర్ణ కలశ కాంతులు



దక్షిణకాశిగా ప్రసిద్ధిగాంచిన శ్రీకాళహస్తిలోని శ్రీకాళహస్తీశ్వరాలయం గోపురాలు స్వర్ణ కాంతుల శోభతో అలరారనున్నాయి. ఇక్కడున్న భిక్షాల గాలిగోపురానికి నెల్లూరుకు చెందిన ప్రముఖ దాత, పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి లక్షలాదిరూపాయలు వెచ్చించి 11 బంగారు కలశాలను ఆలయానికి సమర్పించారు. ఈ నెల 2వతేదీ సాయంత్రం ఎనిమిది కలశాలను శాస్త్రోక్తంగా రాజగోపురానికి ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా గాలిగోపుర కుంభాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఇదే రోజున ఆలయ రాజగోపుర మహాకుంభాభిషేకం అత్యంత వైభవంగా జరిగింది. కంచికామకోటి పీఠాధిపతులు శ్రీ జయేంద్ర సరస్వతి స్వామీజీ సూచనల మేరకు గురువారం శ్రీ విజయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో వేదపండితుల వేదమంత్రోచ్ఛటనల మధ్య, మంగళ వాయిద్యాల మధ్య ఎంతో వైభవంగా 'నవ' కలశాన్ని రాజగోపురంపై ఏర్పాటుచేశారు. గాలిగోపుర కుంభాభిషేకాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత వాస్తు శాంతి, అగ్నికార్యం, పూర్ణాహుతి, కుంభోద్వాసనతో గాలిగోపుర కుంభాభిషేకం వైభవంగా జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో శివనామస్మరణలు మార్మోగాయి. భిక్షాల గాలిగోపుర కలశాలకు దాత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి బంగారుపూత వేయించి ఎంతో భక్తిశ్రద్ధలతో ఆలయం వారికి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామీజీ మాట్లాడుతూ, శ్రీకాళహస్తీశ్వరాలయంలో వున్నట్లుగా ఇంత శోభాయమానమైన గోపురాలు మరే శైవక్షేత్రంలోనూ లేవని, దక్షిణకాశిగా పేరొందిన ఈ ఆలయంలో గోపురాల కళాకాంతులు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీశాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, ఆలయ ఇ.ఓ డి.భ్రమరాంబ, ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట గురవయ్యనాయుడు, ట్రస్ట్‌బోర్డ్ మాజీ ఛైర్మన్‌లు శాంతారాం జె.పవార్, కోలా ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ నెల 8న ఆలయ మహాకుంభాభిషేకం మరెంతో వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# కుల విభజన

(మొదటి పేజీ తరువాయి)

కాపులను బి.సిలలో చేర్చే విషయమై మంజునాథ్ కమిషన్ రాష్ట్ర మంతటా పర్యటిస్తోంది. పర్యటించిన ప్రతిచోటా బి.సిల నుండి కాపులను బీసీలలో చేర్చొద్దంటూ వ్యతిరేకత వస్తోంది. కాబట్టి బి.సిలను దూరం చేసుకోవడం చంద్రబాబుకు ఇష్టం లేదు. అలాగని కాపులు మొత్తం దూరమైతే వచ్చే నష్టం గురించి తెలుసు. అందుకే కొత్త ఎత్తుగడ వేసినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో బలిజలు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారని, వారికి రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందని, అలాగే కాపులు రాజకీయంగా, ఆర్థికంగా సామాజికంగా కృష్ణా, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల్లో బలంగా ఉన్నారని, వారికి రిజర్వేషన్లు అవసరం లేదని నివేదిక ఇవ్వబోతోంది. వాస్తవానికి ఈ జిల్లాల్లో కాపులే అగ్రవర్ణాల నాయకులు. ఈ కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా బలిజలను మాత్రమే బి.సిల్లో చేరుస్తారు. ఇందుకోసం చంద్రబాబు బి.సి సంఘాలను కూడా ఒప్పిస్తాడు. దీనికి తగ్గట్టుగానే ముందస్తుగా ఆయన కాపుల నుండి బలిజలను వేరు చేయాలంటూ తన మనుషుల చేత ఆందోళనలు మొదలుపెట్టించాడు. ఇదంతా ఒక ప్లాన్ ప్రకారమే జరుగుతోంది.

బలిజలకు ప్రత్యేకంగా రిజర్వేషన్లు కల్పించడం వల్ల చంద్రబాబు ఆశిస్తున్న రాజకీయ ప్రయోజనం రాయలసీమ నాలుగు జిల్లాలతో పాటు నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో పార్టీ బలం పెంచుకోవడం! 2014 ఎన్నికల్లో తెలుగుదేశంకు సీట్లు తగ్గింది ఈ జిల్లాల్లోనే! ఈ జిల్లాల్లో బలిజ ఓట్లు ఎక్కువ ఉన్నప్పటికీ రాజకీయంగా వారికి అంత ప్రాధాన్యం లేదు. అదీగాక, ఈ జిల్లాల్లో బలిజ కులస్తులు గతంలో కాంగ్రెస్‌కు, ఇప్పుడు వైకాపాకు మద్దతుగా ఉంటున్నారు. వాళ్లకు రిజర్వేషన్లు ఇస్తే అందరూ తెలుగుదేశంను బలపరుస్తారని, వచ్చే ఎన్నికల్లో ఈ జిల్లాల్లో సీట్లు పెంచుకోవచ్చని చంద్రబాబు నమ్మకం. ఇక కృష్ణా, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల కాపులు రిజర్వేషన్లు ఇచ్చినా కూడా తన వెంట రారనే అపనమ్మకం చంద్రబాబుకు ఏర్పడింది. ఆ జిల్లాల్లో కమ్మ, కాపు వైరం ముదిరింది. కాబట్టి కాపులకు రిజర్వేషన్లు ఇస్తే బి.సిలను దూరం చేసుకోవాల్సి వస్తుంది. దీనికంటే కాపులను వదులుకోవడమే మేలు. అదీగాక ఆ రెంకు పవన్‌కళ్యాణ్ లాంటోళ్లు పోటీ చేస్తే కాపుల ఓట్లు వైకాపాకు పోవు. కాపుల ఓట్లు జగన్‌కు పోకుంటే అది తెలుగుదేశంకే ప్రయోజనం. కాపులను బి.సిలలో చేరిస్తే తనకొచ్చే ప్రయోజనం కంటే బిసిలు దూరమై కలిగే నష్టమే అధికంగా ఉంటుండడంతో చంద్రబాబు ఆ దిశగా కాపులు, బలిజలను వేరుచేసి చూపించే ప్రయత్నం చేయనున్నట్లు తెలుస్తోంది.

# హోదా ఊబిలో చంద్రసైన్యం

(మొదటి పేజీ తరువాయి)

అనుమానాలు రాక తప్పవు. ప్రత్యేకహోదా విషయంలో ఏపిని కేంద్రం నిలువునా మోసం చేసింది. 14వ ఆర్థిక సంఘం ఒప్పుకోవడం లేదని, ఇప్పుడు హోదా వున్న రాష్ట్రాలకే ఎత్తేస్తున్నామని కుంటిసాకులు చెప్పింది. కాని, ఏపికి హోదా ఇవ్వకపోవడానికి, మోడీ మాటతప్పడానికి కారణాలు వేరే వున్నాయి. ఏపికి ప్రత్యేకహోదా ఇస్తే అభివృద్ధిలో దూసుకుపోతుంది. పెట్టుబడులన్నీ ఏపి వైపు క్యూ కడతాయి. ఈ రాష్ట్రానికి 900కిలోమీటర్ల సువిశాల తీరప్రాంతముంది. మంచి జీవనానికి అనువైన రాష్ట్రం. మంచి నాగరికత వున్న ప్రాంతం. తీవ్రవాదం సమస్య లేదు. స్థానిక ప్రజలతో ఇబ్బందులు రావు. కాబట్టి ప్రత్యేకహోదా ఇచ్చుంటే ఇప్పుడు హోదా అమలవుతున్న రాష్ట్రాల్లో పరిశ్రమలను సైతం ఏపికి తరలించి ఉండేవాళ్లు. ఇక తమిళనాడు, కర్నాటక, తెలంగాణ, ఒడిస్సా, గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్రాలలో కంటే ఏపిలోనే పెట్టుబడులు ఎక్కువగా వచ్చేవి. ఏపికి అన్ని విధాలా అనుకూల వసతులున్నాయి. ప్రత్యేకహోదా వచ్చుంటే పారిశ్రామికవేత్తల పెట్టుబడికి మొదటి ఛాయిస్ ఏపినే!

ఏపికి ప్రత్యేక హోదా ఇస్తే మిగతా రాష్ట్రాలపై ప్రభావం పడుతుందని మోడీ గ్రహించాడు. అందుకే ఏపి సీఎంను ప్రత్యేకప్యాకేజీతో కొట్టాడు. నోరెత్తకుండా చేసాడు. ఒకవేళ నోరెత్తితే 'ఓటు-నోటు' కేసు కత్తిని బాబు మెడపై వేలాడదీసాడు. విభజన సమయంలో ఏపికి ప్రత్యేకహోదా ఐదేళ్లు చాలదు, పదేళ్లు కావాలని గొంతు చించుకుని అరచిన వెంకయ్యనాయుడు కూడా ఏపికి జరుగుతున్న అన్యాయాన్ని కళ్లప్పగించి చూస్తుండిపోయాడు. ఆయనకు మోడీని ప్రశ్నించే తెగువ, నిలదీసి అడగాల్సిన అవసరం కూడా లేకుండా పోయాయి. అంత సాహసం చేసి మోడీ దృష్టిలో విరోధి కావడం ఇష్టం లేదు. అందుకే ఆయన కూడా ప్రత్యేకహోదా కంటే ప్రత్యేకప్యాకేజీయే మిన్న అని చెప్పడానికి నానా తంటాలు పడ్డాడు. ప్రత్యేకప్యాకేజీని ఏపికి విదిల్చినందుకు సన్మానాలు కూడా చేయించుకున్నాడు.

ప్రత్యేకహోదా అంకం సమసిపోయిందనుకున్న తరుణంలో తమిళనాడులోని జల్లికట్టు రూపంలో ఈ చిచ్చు మళ్ళీ రేగింది. ప్రత్యేకహోదా కోసం ఇటీవల విపక్షాలు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టడం, చంద్రబాబు పోలీసులను పెట్టి వాటిని అణచివేయడం చూసాం. జగన్ చేసే ఉద్యమం మూలంగానో, కమ్యూనిస్టులు చేసే ఆందోళన వల్లనో, పవన్ కళ్యాణ్ పెట్టే ట్వీట్ల కారణంగానో ఏపికి ఇప్పుడు ప్రత్యేకహోదా రాకపోవచ్చు. అయితే ప్రత్యేకహోదా విషయంలో అధికారపార్టీ నాయకులు ఆడుతున్న కపట నాటకాలు మాత్రం ప్రజలకు కళ్లకు కట్టినట్లు కనపడుతున్నాయి. రాష్ట్రాభివృద్ధి కోసమే ప్రత్యేక ప్యాకేజీని ఒప్పుకున్నామని, ప్యాకేజీకి ఒప్పుకోబట్టే పోలవరం ప్రాజెక్ట్ వచ్చిందని, కేంద్రంతో సఖ్యతగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని సీఎం చంద్రబాబు ప్రజల్ని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రత్యేక ప్యాకేజీ ఎవరికి వస్తుంది, ఎవరు అభివృద్ధి చెందుతారు? ఎవరికి ప్రయోజనం కలుగుతుంది? ఇది ప్రజలకే అంతుబట్టడం లేదు. కేంద్రం నుండి నిధులొచ్చినా అవి ఎక్కడకు పోతాయో, ఎక్కడ పనులు జరుగుతాయో ఎవరికీ తెలియదు. అదే ప్రత్యేకహోదా వస్తే దాని మూలంగా వచ్చే పరిశ్రమలతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. భూముల విలువలు పెరుగుతాయి. పరిశ్రమల మూలంగా ఇతర వ్యాపారాలు జోరందుకుంటాయి. ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అన్నింటికిమించి పన్నుల రూపేణా ప్రజలు ప్రత్యక్ష ప్రయోజనాన్ని చవిచూస్తారు. ఇక చంద్రబాబు కేంద్రం దయతలచిందని చెబుతున్న పోలవరం ప్రాజెక్ట్ విభజన చట్టంలో ఉన్నదే! ఏపికి ఇది హక్కేగాని నరేంద్రమోడీ భిక్ష కాదు. దీని కోసం మనం కేంద్రం ముందు దేబిరించాల్సిన పనిలేదు. పోలవరంకు ఎంత ఖర్చయినా పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్రానిదే! కాని, చంద్రబాబు పోలవరం కాంట్రాక్ట్ పనిని తన చేతుల్లోకి తీసుకుని హోదాపై కేంద్రంతో రాజీపడిపోయాడు. ఇప్పుడు చంద్రబాబు అంచనా వేయించినట్లుగా పోలవరంకు కేంద్రం పూర్తి స్థాయి నిధులివ్వడం కూడా సందేహంగానే ఉంది.

ప్రత్యేకహోదాను ఇటీవల కేంద్రమంత్రి సుజనాచౌదరి పందుల పోరాటంతో పోల్చడాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారు. ఇక రాష్ట్ర మంత్రులు చూస్తే ప్రత్యేకహోదా పొందిన రాష్ట్రాలేవీ మనకంటే బాగా అభివృద్ధి చెందలేదంటున్నారు. వీళ్లు అమాయకులా? లేక ప్రజలను మరీ అమాయకులనుకుంటున్నారా? ఉత్తరాఖండ్, అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్, మేఘాలయ, మిజోరం, జమ్మూ-కాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలు పూర్తిగా కొండలు, లోయలతో కూడిన ప్రాంతాలు. అక్కడ జనావాసానికే కష్టం. ప్రత్యేకహోదా అమలవుతుంది కాబట్టే ఆ రాష్ట్రాలు ఆమాత్రమన్నా అభివృద్ధి చెందాయి. ప్రత్యేకహోదా ఉండబట్టే కదా తెలుగుదేశం నాయకులు కొందరు ఆ రాష్ట్రాల్లో పరిశ్రమలు పెట్టగలిగింది. కొండలు, లోయలు ఉన్న రాష్ట్రాలలోనే పెట్టుబడులు పెట్టంగా లేనిది, ప్రత్యేకహోదా వస్తే ఏపి వంటి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టరా? ఆ రాష్ట్రాల కంటే కూడా ఏపిలో భారీగా పెట్టుబడులు పెడతారు.

ప్రత్యేకహోదాతో ప్రయోజనాలు లేవనడం తెలుగుదేశం నాయకుల ప్యాకేజీ ఎత్తుగడలో భాగమే! ప్యాకేజీతో నాయకులు బాగుపడతారు. ప్రత్యేకహోదాతో రాష్ట్ర ప్రజలు బాగుపడతారు. ఈ నాటకం రాష్ట్ర ప్రజలకు తెలుసు! రాష్ట్ర ప్రజల భవిష్యత్ కోసం ప్రత్యేకహోదాపై పోరాడాల్సిన ముఖ్యమంత్రే ప్రజలను పక్కదారి పట్టిస్తున్నాడు. దీనికి మూల్యం చెల్లించక తప్పదు!

# కళ తప్పిన 'కమలం' బడ్జెట్!

(మొదటి పేజీ తరువాయి)

రియల్ ఎస్టేట్ రంగానికి ఊతమిచ్చే స్టీలు, సిమెంట్ ధరలు తగ్గుతాయని ఆశించారు. కాని వీటిలో ఏ ఒక్కటీ నెరవేరలేదు. పెద్దనోట్ల రద్దు తర్వాత దెబ్బతిన్న ఏ వ్యవస్థల్లోనూ తిరిగి ఉత్సాహాన్నిచ్చే రీతిలో ఈ బడ్జెట్ లేదు. ఇక ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే విభజన సమయంలో యూపిఏ ప్రభుత్వం చేసిన ద్రోహం కంటే కూడా నేటి ఎన్డీఏ ప్రభుత్వం చేస్తున్న మోసమే చరిత్రలో నిలిచిపోయేటట్లుంది. రాష్ట్ర ప్రజలు కూడా కాంగ్రెస్‌తో పాటు ఆ పార్టీ చేసిన ద్రోహాన్ని మరచిపోయారు. ఇప్పుడు కేంద్రంలోని ఎన్డీఏ చేస్తున్న ద్రోహమే రాష్ట్ర ప్రజల మనసుల్లో నిలిచిపోతుంది. ఏపికి ప్రత్యేకహోదా లేదు, విశాఖకు రైల్వేజోన్ లేదు, పోలవరంకు ప్రత్యేక కేటాయింపులు లేవు, దుగరాజపట్నం, రామాయపట్నం పోర్టుల ఊసే లేదు. ఇక కేంద్రం ఏ విధంగా ఏపిని ఆదుకున్నట్లు? మోడీ బదులు అద్వానీ లాంటి జాతీయ దృక్పథం వున్న నేత ప్రధాని అయ్యుంటే ఏపికి ఈ పరిస్థితి దాపురించేదా? అన్యాయమైన రాష్ట్ర విభజనను ఆరోజే పార్లమెంటులో వ్యతిరేకించాడాయన! బీజేపీ వాళ్లంతా ఆరోజు ఆ పెద్దాయన మాటలు వినుంటే ఈరోజు ఏపికి ఈ గతి పట్టి ఉండేది కాదు. మన రాష్ట్రానికే చెందిన వెంకయ్యనాయుడు లాంటి నేతలు కూడా అద్వానీ మాటలను చెవికెక్కించుకోలేదు. ఏకపక్షంగా విభజన బిల్లుకు ఆమోదం తెలిపి అన్యాయం చేశారు. ఇప్పుడు విభజన బిల్లులోని అంశాలను అమలు చేయకుండా ఇంకోసారి ద్రోహం చేస్తున్నారు. దేశం గురించి, దేశంలోని ప్రతి రాష్ట్ర ప్రజల మనోభావాలు, ఆలోచనలు, ఆర్థిక స్థితిగతులు తెలిసిన అద్వానీయే ప్రధాని అయ్యుంటే పెద్దనోట్ల రద్దు వంటి చర్యలుండేవి కావు. ఇలాంటి నిస్సారమైన బడ్జెట్‌లు ఉండేవి కావు. ఏపికి ఇంత అన్యాయం జరిగేదే కాదు. మోడీ మోడీ అని నెత్తికెక్కించుకున్నదానికి దేశ ప్రజలకు తగిన శాస్తే జరుగుతోంది!

## ఆయన బలరామయ్య కాదయ్యా,

# 'భలే' రామయ్య!



**60వ జన్మదినం: ఫిబ్రవరి 3న**

**వేడుక : సా. 6గంటలకు**

**వేదిక : నెల్లూరు టౌన్‌హాల్**

'ఎవురబ్బా!...ఈ బలరామయ్య?'...నెల్లూళ్లో.. నాకు తెలియకుండా!...?


**'ఎవురోగానీ..భలే మంచాయనంట..అందరూ సెప్పుకుంటావుండారు.**

'ఎంత మంచాయనైతే మాత్రం..పుట్టినరోజుగ్గూడా సంబరమేనంట్నా?..

**'భలేవోడివే..ఆయన మంచాయనే కాదు..ఎంతోమంది జనానికి సేవ సేత్తాడంట'..**

'అబ్బో..అట్లనా!..ఏం సేవ సేత్తాడబ్బయ్యా'...డబ్బులిత్తాడా?...

**డబ్బులు గాదు..పేదపిల్లోళ్ళకి కోడిగుడ్లిత్తాడంట..ఎందుకంటే కోడిగుడ్లు తింటే వంటికి మంచిది కదా.. అందుకని పిల్లోళ్ళకి పెద్దోళ్లకి అందరికీ ఉత్త కోడిగుడ్లు కాదు..ఉడకబెట్టి మరీ ఉచితంగానే ఇస్తాడంట!... తెలిసినోళ్ళు కనిపిచ్చినప్పుడల్లా...తినమనిజెప్పి మంచి మంచి చాక్లెట్లిస్తాడంట!..**



'ఓశ్!..ఇంతేనా?'...

**"ఇంతేనా అంటే ఇంతేకాదు..శానావుంది నాయినా కతా!..శెప్తా ఇనుకో!.. నడిస్తే ఆరోగ్యమన్జెప్పి..అందర్నీ ఏసీ సుబ్బారెడ్డి గ్రౌండుకాడకి పిలిపిచ్చుకొచ్చి నడిపిస్తాడంట.. పెద్దోళ్ళకి సిన్నోళ్ళకందరికీ డాక్టర్లచేత ఉచితంగానే పరీచ్చలు చేయిస్తాడంట.. అవసరమైతే వైద్దిగం గూడా జేయిస్తాడంట. జెనమంతా బావుండాలని..ముసిలోళ్ళకి ముతకోళ్ళకి అందరికీ సేతనైన సాయం సేత్తాడంట. అంతేకాదు.. మన తెలుగంటే ఆయనకి పిచ్చి అభిమానంలే.. అందుకే తెలుగును మరిచిపోవొద్దు నాయినా..అని అందరికీ మీటింగులుబెట్టి మరీ సెప్తాడంట.. అంతేకాదయ్యో!...తెలుగోళ్ళ సంగంలో ఆయనో పెద్ద నెంబరంట కూడా.. ఇంట్లో వాళ్ళకీ, ఊళ్ళోవోళ్ళకీ అందరితో మంచిగా వుంటూ... ఇలా నిద్దర మంచం లేచిందగ్గర్నుంచీ ఎవురికో ఒకరికి సాటి మనిషిగా సేవ చేస్తానే వుంటా దంట..తెల్సా!..."**

'ఓర్నాయనో భలేగుండాదే..ఇట్టాటోల్లింకా నెల్లూళ్ళో వుండారా?.. ఇంతకీ ఆయన పేరేందన్నావు?...

**బలరామయ్యంట... కొందరు కోడిగుడ్ల బలరామయ్య అని కూడా పిలస్తారంట. ఎందుకంటే ఆయన పిల్సిపిల్సి కోడిగుడ్లిస్తుళ్ళా..అందుకని!...**

"అబ్బో!..ఆయనెవురోగానా బలరామయ్య కాదు, 'భలేరామయ్య'గా వున్నట్టుందే..ఆయినా అట్టాటి మంచాయన్ని మనం గూడా సూడాల్సిందే..

**"అంత మంచాయన గాబట్టే...ఆయనొద్దంటున్నా ఇనకుండా...ఆయన పుట్టి అరవై ఏళ్ళయిందని తెల్సుకోని అందరూ గల్సి ఆయనకి పుట్టినరోజు గొప్ప సంబరంగా సేత్తావుండారంట.. పాటలుగీటలన్నీ బలే బాగుంటాయంటలే. జెనమంతా గూడా భలే వత్తారంట!**

'అబ్బో!...అయితే మనం గూడా సూడాలబ్బయ్యా!.ఇంతకీ ఎప్పుడంటా?.. .

**"మూడోతేదంట!... టౌనాలుకాడ పెద్దపెద్ద బోర్డులు కూడా ఏసిళ్ళా... సుక్కురోరం సాయింకాలం.. ఆరోగంటకల్లా అక్కడుంటాలంట.లేకపోతే కూసోడానికి గూడా సోటుండదంట. మర్సిపోకుండా... టౌనాల్ కాడకి పెందలకాడే రా..నువ్వుగూడా సూద్దువు గానీ.. 'అయినా..అట్టాటి మంచాయన్ని మనం సూడకపోతే ఎట్టబ్బయ్యా!...**

తప్పకుండా వస్తా గానా.. నువ్వు వాకిలికాడే వుండు..నన్నుగూడా లోపల్కి తీసకపో...ఇద్దరంబోయి సంతోసంగా.. అట్టాటి మంచాయనకో మిఠాయి తినిపిద్దాం..మంచి పూలదండేద్దాం!.. ఏమంటావ్?

**'సరే సరే!..గభానొచ్చేయ్!...**

## వినోద్ ఆధ్వర్యంలో...

# స్వైన్‌ఫ్లూ మాస్కులు



యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేతంరెడ్డి వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో 1వ తేదీ నెల్లూరులోని ఇందిరాభవన్ వద్ద ప్రజలకు స్వైన్‌ఫ్లూ నివారణ కోసం ఉచితంగా మాస్కులను అందజేశారు. నగర కాంగ్రెస్ అధ్యక్షులు ఉడతా వెంకట్రావ్‌యాదవ్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. స్వైన్‌ఫ్లూ వ్యాధిపై ప్రజలను అప్రమత్తం చేసి, ప్రజలను ఈ వ్యాధి బారిన పడకుండా చేసేందుకు తమవంతుగా ఈ ప్రయత్నం చేస్తున్నామని ఈ సందర్భంగా వినోద్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రఘురాం ముదిరాజ్, బాలసుధాకర్, వెంకట్రావు, కస్తూరయ్య, మోషా, మధులు పాల్గొన్నారు.







### జి.వి.కె. - సుబ్బరామిరెడ్డిల ముద్దుల మనుమడు

# కేశవ్ - వీణల పెళ్ళి సందడి

ఒకరు వ్యాపార దిగ్గజం, మరొకరు రాజకీయ సినీ రంగాలలో ప్రముఖుడు. జి.వి.కె.రెడ్డి కుమారుడు సంజయ్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి కుమార్తె పింకిరెడ్డిల ముద్దుల కుమారుడు, ఇద్దరు తాతల ముద్దుల మనుమడు కేశవ్‌రెడ్డి – వీణల పెళ్ళి వేడుక జనవరి 27, 28, 29వ తేదీలలో హైదరాబాద్‌లో ధూందాంగా జరిగింది. అన్ని రంగాలకు చెందిన ప్రముఖులు వందల సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొనగా రెండు కుటుంబాలకు చెందిన వేలాదిమంది అభిమానులతో శంషాబాద్‌లోని జి.ఎం.ఆర్ గ్రాండ్ నిండిపోయింది.

భారతదేశంలోనే కాక ప్రపంచంలో ఎక్కడకు వెళ్లినా వీరిపేరు చెప్తేనే గుర్తించే స్థాయికి ఎదిగిన జి.వి.కె.రెడ్డి, సుబ్బరామిరెడ్డి ఇద్దరూ నెల్లూరీయులు కావడం నెల్లూరు సీమకే గర్వకారణం. వధూవరులిద్దరితో పాటు కేశవ్ తాతలిద్దరి కుటుంబాలకు 'లాయర్' శుభాకాంక్షలు.








Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com